
# ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

గురువారం 9 జనవరి 2025 | 5


## అట్టహాసంగా..

### ముగిసిన యానాం ప్రజా ఉత్సవాలు

జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో మూడు రోజులు జరిగిన 21వ యానాం ప్రజా ఉత్సవాలు బుధవారం రాత్రి అట్టహాసంగా ముగిసాయి. చివరిరోజు బుధవారం రాత్రి వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రత్యేక నృత్యాలు, ఫ్యాషన్ షోలతో అదరగొట్టారు.. ఆ దృశ్యాల్లో కొన్ని..

6



కాకినాడలో జరిగిన యూటీఎఫ్ మహాసభల్లో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గ నాయకత్వం

## ముగిసిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

కాకినాడలో నాలుగు రోజులపాటు జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు బుధవారం ముగిసాయి. చివరిరోజు ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను త్వరలో చెల్లించనుందని వెల్లడించారు. కాగా యూటీఎఫ్ నూతన రాష్ట్ర కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కేఎస్ఎస్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులుగా సురేష్‌కుమార్, ప్రచురణాల కమిటీ ఛైర్మన్‌గా ఎం.హనుమంతరావు ఎన్నికయ్యారు. -7లో





# ‘తెలుగు’ వెలుగు

### జీజీయూలో ఘనంగా ప్రారంభమైన ప్రపంచ తెలుగు మహాసభలు



రాజమహేంద్రవరం సమీపంలోని రాజానగరంలో ఉన్న గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ప్రారంభమైన రెండవ ప్రపంచ తెలుగు మహాసభల్లో నృత్య ప్రదర్శన

- తరలివచ్చిన ప్రముఖులు
- తెలుగులోనే పాలన సాగాలి : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- వైభవంగా సాగిన తొలిరోజు పండుగ



తెలుగు మహాసభలను ప్రారంభిస్తూ జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకయ్యనాయుడు, పక్కన గరికిపాటి, యార్లగడ్డ, చైతన్యరాజు, చామర్తిరాజు తదితరులు.. (కింద) వెంకయ్య ఉపన్యాసం

రాజానగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పాలనే సంకల్పంతో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)ప్రాంగణంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న 2వ ప్రపంచ తెలుగు మహాసభలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జీజీయూ ప్రాంగణంలో ఆదికవి నన్నయ భట్టారక, రాజరాజ నరేంద్ర, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు పేరిట మూడు ప్రధాన వేదికలను ముస్తాబు చేసి తెలుగు భాషా సాహితీ ప్రక్రియలను నిర్వహించారు. ప్రధాన వేదిక చెంతనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుచేసిన అయోధ్య బాలరాముడి ఆలయ నమూనా అందరినీ అబ్బురపరుస్తోంది. ఉదయం గణపతి ఆరాధన అనంతరం జీజీయూ కులపతి కలిదిండి సత్యనారాయణరాజు(చైతన్యరాజు) అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలను మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన అంతా తెలుగులోనే సాగాలి. ఇక తెలుగు మాట్లాడేవాడికే ఓటేయాలి. తెలుగు భాష రానివాళ్లను ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్‌వాళ్లు రాజమహేంద్రవరం వంటి పేర్లు పలకలేక రాజమండ్రిగా మార్చారు. ఇక రాజమహేంద్రవరం అనే పిలవాలి. ఇలా చాలాపేర్లు, పదాలు మార్చేసి, మనభాషను, సంస్కృతిని చెడగొట్టారు. వాటిని మనం సరిదిద్దుకోవాలన్నారు. ఆదికవి నన్నయ్య, ఆధునిక వైతాళికుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం వంటి వారెందరో తెలుగుభాషను సుసంపన్నం చేశారని గుర్తుచేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో మహాసహస్రావధాని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు, బృహత్ ద్విసహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ, ఆధ్యాత్మికవేత్త, శ్రీభారతీ తీర్థ పురస్కార గ్రహీత పి.బంగారయ్యశర్మ, సినీ గేయరచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, ప్రొఫెసర్ చామర్తి రాజు, కేటీ రామరాజు, యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా సోలోమన్ డార్విన్, మాజీ ఎమ్మెల్సీ గోనె ప్రకాశరావు, శతావధాని కడిమెళ్ల వరప్రసాద్, ధూళిపాళ మహాదేవమణి, ప్రముఖ హాస్యనటుడు భద్రం, స్టార్టప్ కంపెనీ స్థాపించి వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న మృత్యుంజయేశ్వర్, గోమూత్రంతో కేన్సర్, డయాబెటీస్ వంటి వాటికి మందులు తయారు చేస్తున్న మహారాష్ట్రకు చెందిన కన్నయ్య కదంజి, న్యూక్లియర్ శాస్త్రవేత్త ఆర్.శ్యామసుందర్, సాహితీవేత్త ఎర్రాప్రగడ రామకృష్ణ, వేదుల శిరీష, మధుప్రోమా, జీజీయూ ఉపకులపతి ఉదయగిరి చంద్రశేఖర్, జీజీయూ ప్రోఛాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ, మాజీ ఎమ్మెల్సీ రవివర్మ తదితరులు విచ్చేశారు. ప్రముఖులు పీవీబీ సంజీవరాజు, సత్యనారాయణరాజు, కృష్ణంరాజు, సుబ్బరాజు, వీఎస్ఆర్ సోమయాజులు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.



### తెలుగుభాష కోసం ఉద్యమించాలి : గరికిపాటి



ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు విధిగా తెలుగు మాధ్యమమే ఉండాలి. డిగ్రీ వరకు తెలుగు పాఠ్యాంశం ఉండాలి. ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే విధంగా ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందని మహాసహస్రావధాని, పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు అన్నారు. తెలుగు మహాసభల్లో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఫోన్ చేసి, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాలని కోరిన సందర్భంలో ఈ డిమాండ్లు చెప్పానన్నారు. ఇవి జరగనప్పుడు భాషా సంఘం ఉన్నా ప్రయోజనం లేదన్నారు.



వెంకయ్యనాయుడిని సత్కరిస్తున్న ప్రముఖులు

### నన్నయతోనే తెలుగు సాహిత్య విప్లవం : యార్లగడ్డ



పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ చైతన్యరాజు నాంది పలికిన ఈ కార్యక్రమం చారిత్మాత్మకం అవుతుందన్నారు. నన్నయ మహాభారతాన్ని ఆంధ్రీకరించడంతో ఈ ప్రాంతంలో తెలుగులో సాహిత్య విప్లవం మొదలైందన్నారు. హిందీ అష్టావధానం చేసిన ఈ నగరానికి చెందిన చేబోలు శేషగిరిరావు కాంస్య విగ్రహాన్ని గతంలో తయారు చేయించానని, దానిని ప్రతిష్ఠింపజేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన చైతన్యరాజుకు విజ్ఞప్తిచేశారు.

### తెలుగుపై ప్రేమతోనే నిర్వహణ : చైతన్యరాజు



తెలుగుభాష పట్ల అపారమైన ప్రేమ ఉన్నందునే ప్రపంచ మహాసభలను ఇక్కడ నిర్వహిస్తున్నామని జీజీయూ కులపతి చైతన్యరాజు అన్నారు. గతేడాది జనవరిలో మూడు రోజులపాటు మహాసభలు జరిపించి, ఐదు రోజులపాటు శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు జోడించిన విషయాన్ని గుర్తుచేశారు. కృత్రిమ మేథ, సాంకేతికతతో అయోధ్య రాముని నమూనా ఆలయం ఏర్పాటు చేశామన్నారు.

## త్వరలో ‘జన్మభూమి’ పునఃప్రారంభం

### కలెక్టర్ మహేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే జన్మభూమి కార్యక్రమాన్ని పునఃప్రారంభించనున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. ఈలోపుగానే రెవెన్యూ సదస్సుల్లో అందిన ఫిర్యాదులను రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా పూర్తి నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫ్రీ హోల్డ్ భూముల డేటా ఎంట్రీ, భూ సంబంధిత ఫిర్యాదుల పరిష్కారం, రీ సర్వే అంశాలను రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. బుధవారం రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో అందిన ఫిర్యాదులపై గ్రామాల వారీగా నివేదికలు రూపొందించారన్నారు. భూ వివాదాలకు చెక్ పెట్టే దిశగా రూపొందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సమర్థవంతంగా చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 30 రెవెన్యూ అంశాలకు సంబంధించి 4212 అర్జీలు అందాయన్నారు. అసైన్డ్ ఫ్రీహోల్డ్ భూములు, అన్‌రిజిస్టర్డ్ ఫ్రీ హోల్డ్ భూములు, రిజిస్టర్డ్ ఫ్రీహోల్డ్ భూములు, ఈనాం, చుక్కల, పట్టా భూములు డేటా ఎంట్రీ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కార సరళిపై అర్జీదారులు నూరుశాతం సంతృప్తికరంగా ఉన్నప్పుడే ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ప్రతీ రెవెన్యూ అంశం ఆన్‌లైన్‌లో ప్రతిబింబించే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, భూపరిపాలన డిప్యూటీ తహశీల్దార్ చినబాబు తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ ఉపకేంద్రం టవర్ల ఏర్పాటుకు సమావేశం..

జిల్లాలో విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజీ సమస్యను అధిగమించి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు వీలుగా చర్యలు చేపట్టినట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. అయినవిల్లి విద్యుత్ ఉపకేంద్రం వరకు 64 టవర్ల ఏర్పాటుకు సంబంధించి భూసేకరణకు ఆయా భూముల యజమానులతో బుధవారం కలెక్టర్ సమావేశం నిర్వహించి భూముల విలువలపై సమీక్షించారు. అయినవిల్లి గ్రామంలో నిర్మిస్తున్న 400 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్వహణకు గాను విద్యుత్ లైన్ల ఏర్పాటుకు 64 విద్యుత్ టవర్లు నెలకొల్పేందుకు చర్యలు చేపట్టామన్నారు. టవర్ల ఏర్పాటుకు సంబంధించి అవసరమైన భూమిని సేకరించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భూ యజమానులకు పరిహారం చెల్లిస్తామన్నారు. భూ విలువలు పెంచి సెంటు భూమికి గరిష్ఠంగా రూ.55 వేలు చొప్పున చెల్లించనున్నట్లు చెప్పారు. ఒక్కో టవర్ ఏర్పాటుకు సుమారు రూ.2లక్షలు చొప్పున ఖర్చు అవుతుందని విద్యుత్‌శాఖ అధికారులు వివరించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా భూ యజమానులు, రైతులు పూర్తిగా సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జేసీ నిషాంతి, ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ శివరామకృష్ణ, డీఈ పుల్లయ్య, ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ మల్లికార్జునరావు, సహ ఇంజనీర్లు అనిల్, రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

### టెన్త్ పరీక్షలకు 19217 మంది..

రాయవరం, జనవరి8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలకు జిల్లా నుంచి 19217 మంది విద్యార్థులు హాజరవుతున్నారని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సలీం బాషా తెలిపారు. రాయవరం మండలంలోని మాచవరం పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఉన్న 237 ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, 171 ప్రైవేటు పాఠశాలల నుంచి 19217 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 111 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా అన్ని మౌలిక సదుపాయాలు ఉన్న పాఠశాలలను ఎంపిక చేసినట్లు చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, ఉపాధ్యాయులు 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక సరఫరా చేయాలి

### ఇసుకపై సమీక్షలో అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక సరఫరా చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో పట్టా భూముల్లో ఉన్న ఇసుక తవ్వకాలకు సంబంధించిన దరఖాస్తులకు సంబంధించి ప్రాధాన్యతా క్రమంలో సర్వే నిర్వహించి అనుమతులు మంజూరు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌లలో తవ్వకాలను సాధ్యమైనంత ఎక్కువగా నిర్వహిస్తూ స్టాక్ యార్డుల్లో వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా ఇసుకను నిల్వ చేయాలన్నారు. కొత్తగా నియమించిన ఏజెన్సీలు మూడు రీచ్‌లలో వారం రోజుల్లో ఇసుక తవ్వకాలు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా ఇసుక అక్రమ తరలింపునకు ఆస్కారం లేకుండా సీసీ కెమెరాలు నిఘా, పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలన్నారు. ప్రతిపాదనలకు సంబంధించి జాయింట్ తనిఖీలు త్వరితగతిన నిర్వహించి తవ్వకాల కోసం మైనింగ్ ప్లాన్, పర్యావరణ అనుమతులు జారీ చేయాలన్నారు. భవన నిర్మాణ రంగ డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక సరఫరా ఉండాలన్నారు. జిల్లా రవాణాధికారి ఇసుక టోకెన్ల జారీకి అనుగుణంగా సకాలంలో చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇసుక తవ్వకాలకు అనువైన రీచ్‌లను కూడా గుర్తించాలన్నారు. ఇసుక నాణ్యత, పరిమాణం తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఉచిత ఇసుక నిర్వహణ పాలసీకి అనుగుణంగా వినియోగదారులకు బుకింగ్ అంశాలపై మరింత అవగాహన పెంపొందించాలన్నారు. సమావేశంలో జేసీ నిషాంతి, ఆర్డీవోలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి ఎల్.వంశీధర్‌రెడ్డి, రియల్టీ ఇన్‌స్పెక్టర్ పి.సుజాత, కోఆర్డినేటర్ సువిజయ్ పాల్గొన్నారు.

## ఏపీఎస్ఆర్టీసీ ‘సంక్రాంతి స్పెషల్’

- అమలాపురం టూ హైదరాబాద్‌కు 217 బస్సు సర్వీసులు
- ప్రయాణికులను నిలువునా దోచేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్
- సాధారణ చార్జీలతోనే ఏపీఎస్ఆర్టీసీ ‘స్పెషల్స్’

అమలాపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వస్తుందంటే హైదరాబాద్ నుంచి కోనసీమకు వచ్చే ప్రయాణికుల కోసం ఆర్టీసీ సర్వీసులతో పాటు ప్రైవేటు ట్రావెల్స్ పోటీపడి మరీ బస్సులను ఏర్పాటు చేస్తాయి. ఇప్పటికే తెలంగాణ ఆర్టీసీతో పాటు మన ప్రైవేటు ట్రావెల్ బస్సుల టిక్కెట్ ధరలను ఆన్‌లైన్‌లో చూసి ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నా పట్టించుకునేవారే లేరు. తెలంగాణా ఆర్టీసీ సైతం టిక్కెట్ ధరలను రెట్టింపు చేసింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కొనసాగుతున్న ధరలను పోల్చి చూసుకుంటే తెలంగాణ ఆర్టీసీ బస్సు టిక్కెట్ ధర హైదరాబాద్ నుంచి అమలాపురానికి రూ.1800 ఉంది. ఇక మన ప్రాంత ప్రైవేటు ట్రావెల్ బస్సులు అయితే రూ.1599 నుంచి రూ.2500 వరకు దోచేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఏపీఎస్ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు సంక్రాంతి కానుక ప్రకటించింది. సాధారణ రోజుల్లో వసూలు చేసే టిక్కెట్ ధరలనే వసూలు చేస్తామని ప్రకటించింది. సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని ఈ నెల 9 నుంచి ప్రత్యేక బస్సు సదుపాయాలు కల్పించడంతో పాటు ఆన్‌లైన్‌లో టిక్కెట్ల రిజర్వేషన్లు అందుబాటులో ఉంచారు.

### సంక్రాంతికి 217 ప్రత్యేక బస్సు సర్వీసులు

**చల్లా సత్యనారాయణమూర్తి, అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్**



సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని అమలాపురం ఆర్టీసీ బస్సు డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశాం. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు హైదరాబాద్ నుంచి అమలాపురం వైపు వచ్చే ప్రయాణికుల కోసం మొత్తంగా 97 సర్వీసులు ఏర్పాటు చేశాం. సాధారణ రోజుల్లో హైదరాబాద్‌కు 12 బస్సు సర్వీసులు నడుపుతున్నాం. వీటిలో 6 శంషాబాద్ విమానాశ్రయానికి, 6 బీహెచ్ఈఎల్, ఇతర ప్రాంతాలకు నడుపుతాం. సంక్రాంతిని పురస్కరించుకుని వీటికి అదనంగా 85 సర్వీసులను నాలుగు రోజుల పాటు నడిపే విధంగా ప్రణాళికలు రూపొందించాం. ఇప్పటికే చాలా వరకు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ అయ్యాయి. అమలాపురం నుంచి తిరుగు ప్రయాణం కోసం ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు 12 రెగ్యులర్ సర్వీసులతో పాటు రోజుకు 22 సర్వీసులు చొప్పున మొత్తంగా డిమాండ్‌ను బట్టి 120 బస్సు సర్వీసులు 6 రోజుల పాటు నడుపుతామన్నారు. ప్రయాణికులపై ఎటువంటి అదనపు భారం మోపడం లేదు. సాధారణ రోజుల్లో వసూలు చేసే టిక్కెట్ ధరలనే పండుగ రోజుల్లోను అమలు చేస్తున్నాం. అమలాపురం నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సు సర్వీసుకు రూ.900, ఇంద్ర బస్సుకు రూ.1100, అమరావతి బస్సు సర్వీసుకు రూ.1400 చొప్పున సాధారణ ధరలే ప్రయాణికుల నుంచి వసూలు చేస్తాం. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.

## ‘మత్స్యకార సంఘాల మధ్య వివాదాన్ని పరిష్కరించాలి’

అమలాపురం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద మత్స్యకార సంఘాల మధ్య నెలకొన్న వివాదాన్ని శాంతియుతంగా ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన దిశగా పరిష్కార చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మత్స్యశాఖ అధికారులు, నదీ సంరక్షణ అధికారులు, పోలీసు అధికారులు, ఇరు మత్స్యకార సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కాటన్ బ్యారేజీ వద్ద బొబ్బర్లంక మత్స్యకార సంఘం, ధవళేశ్వరం మత్స్యకార సంఘాల మధ్య నెలకొన్న వివాదంపై చర్చించారు. రొయ్యపిల్లల సేకరణ సరిహద్దు వివాదానికి దారితీసిన పూర్వాపరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ధవళేశ్వరం, బొబ్బర్లంక మత్స్యకార సంఘాల ప్రతినిధులు మత్స్యకార సంఘాలుగా నమోదు చేసుకోవాలన్నారు. సమస్యకు శాంతియుత వాతావరణంలో చర్చలు చేపట్టి ఇరు సంఘాలకు ఆమోద యోగ్యంగా రొయ్య పిల్లల సేకరణకు ఒక విధానాన్ని రూపకల్పన చేయాలన్నారు. ధవళేశ్వరం మత్స్యకార సంఘం మొత్తం 70 గేట్ల వద్ద లీజు చెల్లిస్తుందని, అయితే బొబ్బర్లంక మత్స్యకారులు 30 గేట్ల వద్ద రొయ్యల పిల్లల సేకరణ ప్రక్రియను చేపడుతూ జీవనాధారం పొందుతున్నారన్నారు. గోదావరి బ్యారేజీ వద్ద లభించే రొయ్య పిల్లలకు బహిరంగ మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య రొయ్య పిల్లల సేకరణకు సరిహద్దుల వివాదం నెలకొందన్నారు. నదీ సంరక్షణ అధికారి ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, కోనసీమ మత్స్యశాఖ జిల్లా అధికారి ఎన్.శ్రీనివాసరావు, ఎఫ్‌డీవోలు డేవిడ్‌రాజు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలుగు వైభవం

## ఘనంగా తెలుగు మహాసభల తొలిరోజు పండుగ



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రత్యేక ఆకర్షణగా ప్రముఖుల విగ్రహాలు



బాలరాముని నమూనా ఆలయం వద్ద మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పూజలు



ప్రముఖ కవి జొన్నవిత్తులకు సన్మానం

తెలుగు వెలుగైంది..ఆ వెలుగు ప్రపంచ తెలుగు మహాసభలకు వచ్చిన భాషాభిమానుల కళ్లల్లో కనిపించింది..రాజమహేంద్రవరం కేంద్రంగా గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో ప్రపంచ తెలుగు మహాసభలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తేనె పలుకుల సంపద అయిన అమ్మభాషకు అందలం దక్కింది.. ఆ మధుర క్షణాల్లో తనువు అణువణువు పులకించింది..





ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాఠశాల విద్యార్థులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే రీతిలో చేసిన పలు ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. ప్రధానంగా భువన విజయం, నెమలి నృత్య ప్రదర్శన, జానపద నృత్య ప్రదర్శన, కవి సమ్మేళనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.



స్టాల్స్‌ను తిలకిస్తున్న విద్యార్థులు




ముఖ్య అతిథులతో సభా వేదిక

### బాలరాముని ఆలయం

రాజానగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ రాజమహేంద్రవరంలో ప్రారంభమైన ప్రపంచ తెలుగు మహాసభల వేడుకల్లో ప్రధాన వేదికను ఆనుకుని తీర్చిదిద్దిన అయోధ్య బాలరాముని నమూనా ఆలయం అందరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది. సాంకేతికతను వినియోగించి అయోధ్య బాలరాముని ఆలయం తీర్చిదిద్దినట్లు జీజీయూ ఉపకులపతి ఉదయగిరి చంద్రశేఖర్ వెల్లడించారు. భక్తులు కోరిన విధంగా ఈ నమూనా ఆలయం తీర్చిదిద్దామన్నారు. అలాగే ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అబ్దుల్ కలాం అవతార్(డిజిటల్) స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడకు వచ్చి ఎవరైనా గౌరవప్రదమైన ప్రశ్నలు అడిగితే సరైన సమాధానాలు వారి నుంచి వస్తాయని చెప్పారు.

'నిలువెత్తు' సంపద





ముగింపు సభలో మాట్లాడుతున్న లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్

# యానాం ప్రజా ఉత్సవాలు సంక్రాంతిని తలపిస్తున్నాయి

● పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్

యానాం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యానాం ప్రజా ఉత్సవాలు సంక్రాంతిని తలపిస్తున్నాయని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్ అన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మ ల్లాడి కృష్ణారావు సారథ్యంలో యానాం ప్రజల స్వచ్ఛంద సేవా సంస్థ, పర్యాటక శాఖ సంయుక్త నిర్వహణలో జరిగిన యానాం ప్రజా ఉత్సవాలు, ఫల, పుష్ప ప్రదర్శనల ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలుగులో మాట్లాడి ఆశ్చర్యపరిచారు. 'తెలుగు భాష చాలా తీయనిది. 1965లో మద్రాసులో చదువుకున్న సమయంలో నాకు ఎక్కువ మంది స్నేహితులు గుంటూరు, గూడూరు, నెల్లూరు, రాజమండ్రి, కాకినాడ వారే ఉండేవారు. వారితో ఎక్కువగా సాన్నిహిత్యం ఉండేది. వారితో కలిసి తెలుగు సినిమాలు చూసేవాడిని' అన్నారు. మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇంతమంది ప్రజలు ఒక్కచోట చేరినందుకు, ప్రజా ఉత్సవాలు, ఫలపుష్ప ప్రదర్శనల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. నూతన సంవత్సరారంభంలో గొప్ప సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగం కావడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానన్నారు. పవిత్రమైన గోదావరి బంగాళాఖాతంలో కలిసే ఈ అందమైన ప్రాంతం యానాం. దేశమంతటా... ముఖ్యంగా పుదుచ్చేరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ప్రధాని మోదీ సంకల్పిస్తున్నారన్నారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ముందుగానే పండుగ వాతావరణం వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తారని ఆశిస్తున్నారన్నారు. ముఖ్యంగా అందరి సమష్టి కృషితో యానాం పర్యాటకపరంగా మరింత అభివృద్ధి చెందేందుకు ఎక్కువగా అవకాశాలున్నాయి. యానాం అభివృద్ధికి తగిన సహకారం అందజేస్తామన్నారు. అనంతరం పర్యాటక శాఖ మంత్రి లక్ష్మీనారాయణ, ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడారు. గవర్నర్‌కు ఢిల్లీ ప్రతినిధి మల్లాడితో పాటు మల్లాడి అభిమాన సంఘం, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పౌర సన్మానం చేశారు. యానాంలో పలు అభివృద్ధి పనులను గవర్నర్ కైలాష్‌నాథన్ ప్రారంభించారు.



లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి మల్లాడి









ప్రజా ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఆకట్టుకున్న లేజర్ షో

# అట్టహాసంగా ముగిసిన యానాం ప్రజా ఉత్సవాలు

యానాం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో మూడు రోజులు జరిగిన 21వ యానాం ప్రజా ఉత్సవాలు బుధవారం రాత్రి అట్టహాసంగా ముగిసాయి. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సారథ్యంలో యానాం ప్రజల స్వచ్ఛంద సేవా సంస్థ, పర్యాటక శాఖ సంయుక్తంగా ఈ ఉత్సవాలు నిర్వహించాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల ప్రత్యేక నృత్యాలు, ఫ్యాషన్ షో అలరించాయి. చివరి రోజైన బుధవారం విశాఖపట్నానికి చెందిన విక్టరీ ఈవెంట్ మేకర్స్ మేడిది విక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైకా, లేజర్ షో, ఫైర్‌షో, ముంబయి డ్యాన్స్, కోల్‌కత్తా డ్యాన్స్ అంథేరా డ్యాన్స్, చెన్నైకు చెందిన సంపత్ జంగ్లీగ్ డ్యాన్స్ ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బృందం సినీ ఆర్కెస్ట్రా నిర్వహించారు. ప్రముఖ గాయకులు ఆలపించిన సినీ గీతాలు ఆహుతులను అలరించాయి. అనంతరం నృత్య పోటీల్లో గెలుపొందిన వారితో ప్రదర్శనలు ఇప్పించాయి. టీవీ, ఫిలిం ఆర్కెస్ట్రా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ రాజశేఖరన్ నేతృత్వంలో సీఐ షణ్ముగం బందోబస్తు చర్యలు చేపట్టారు.







ప్రముఖ గాయకుడు శ్రీకృష్ణ బృందం సినీ సంగీత విభావరి

# మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం





విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం

## భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనం పైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

# ఏడీబీ రహదారి పనుల ప్రక్రియపై సమగ్ర వివరాలు ఇవ్వండి

## తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఏడీబీ నిధులతో చేపట్టిన రహదారి పనులను త్వరితగతిన పూర్తిచేసే క్రమంలో వాటికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్‌పరంగా సేకరణ ప్రక్రియపై సమగ్ర వివరాలు తనకు అందజేయాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రెవెన్యూ అధికారులతో ఏడీబీ రోడ్డు పనులపై బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ-రాజానగరం వరకు నిర్మిస్తున్న ఏడీబీ రోడ్డు మార్గం పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకుని రావడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఈ క్రమంలో రహదారి నిర్మాణ పనులకు ఆటకం లేకుండా చూడాలన్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ప్రాజెక్ట్ అధికారిగా జేసీ, భూసేకరణ అధికారిగా రాజమహేంద్రవరం ఆర్డీవో, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా రాష్ట్ర హైవే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రహదారి విస్తరణకు మొత్తం 72.16 ఎకరాల భూమి సేకరణ చేపట్టాల్సిఉంటుందన్నారు.ఇందులో 57.69 ఎకరాలు ప్రైవేట్ భూమి సేకరించగాతూర్పుగోదావరి జిల్లాలో 34.11 ఎకరాల భూమి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీకి అప్పగించామన్నారు. ఆక్రమణలకు పాల్పడినవారిని ఖాళీ చేయించే దిశలో చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ చిన్నరాముడు, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఈఈ శ్రీకాంత్, డీఈ రాజానగరం, రంగంపేట తహసీల్దార్ లావణ్య, కె.అనసూయ పాల్గొన్నారు.



రంగంపేట మండలం ఎస్టీరాజాపురంలో ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

### క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన

రంగంపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ-రాజానగరం ప్రధాన రహదారి మార్గంలో ఏపీరహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏడీబీ నిధులతో చేపట్టిన పనులను పూర్తి చేయడంలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజానగరం, రంగంపేట మండలాల పరిధిలో ఏడీబీ రోడ్ రహదారి పనులను, భూసేకరణ విషయంలో క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని అంచనా వేసేందుకు జేసీ చిన్నరాముడుతో కలిసి బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు.

### నష్టపరిహారం ఇప్పించి నిర్మించండి

జేసీ చినరాముడు రంగంపేట, పెదరాయవరం తదితర గ్రామాలకు చెందిన ప్రాంతాల్లో రహదారి మార్గాన్ని పరిశీలించారు. రంగంపేట సెంటర్‌లోని షాపుల యజమానులతో మాట్లాడారు. షాపులను స్వచ్ఛంధంగా ఖాళీచేయాలని చెప్పగా రోడ్డు విస్తరణలో భాగంగా తమ ఇల్లు, షాపులు పోతున్నందున తమకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదని, ఇల్లు కోల్పోతున్నవారికి వేరేచోట ఇళ్ల స్థలాలు ఇస్తామన్నా ఇవ్వలేదని, షాపుల కోల్పోతున్నందున తమ కుటుంబాలు వీధిన పడే పరిస్థితి వస్తుందన్నారు. దానికి స్పందించిన జేసీ త్వరలో భూమి కోల్పోతున్న రైతులకు, షాపుల యజమానులకు సమావేశం ఏర్పాటు చేసి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఆర్‌డీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంత్, రాజానగరం, రంగంపేట తహశీల్దార్‌లు లావణ్య, కోసు అనసూయ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం

● కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే రోడ్ల అభివృద్ధి ● కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ● ముగిసిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు




సభలో మాట్లాడుతున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు త్వరలో చెల్లించనుందని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడించారు. కాకినాడ పీఆర్ డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో బుధవారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల ముగింపు కార్యక్రమం జరిగింది. సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. జలజీవన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.21వేలకోట్లు ఏపీకి మంజూరు చేసిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు ధ్వంసం అయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో భారీఎత్తున పరిశ్రమలు రానున్నాయన్నారు. ఎన్డీఏ అధికారంలోకి రావడంలో యూటీఎఫ్ ఉపాధ్యాయుల పాత్ర కూడా ఉందన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు.

సభలో కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి యూటీఎఫ్ నిరంతరం ఉపాధ్యాయుల కోసం పనిచేస్తుందన్నారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం మాట్లాడుతూ 140ఏళ్ల చరిత్ర కలిగిన రాష్ట్రంలో రెండో అతిపెద్ద ప్రభుత్వ కళాశాల ఇదేనని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు 67 దేశాల్లో వివిధ ఉన్నతస్థాయిలో పనిచేస్తున్నారన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్, మోడల్‌స్కూల్, పంచాయతీరాజ్, కస్తూరిబా పాఠశాలలు ఇలా అన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు యూటీఎఫ్ కృషి చేస్తుందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిల కోసం యూటీఎఫ్ కార్యాచరణ రూపొందించిందన్నారు. ఫిబ్రవరి 17వతేదీ నుంచి కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. దీని కోసం తొలుత ఫిబ్రవరి 2న విజయవాడలో సదస్సు నిర్వహిస్తామని తర్వాత ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలు, ఉత్తర రాయలసీమ, దక్షిణ రాయలసీమల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలో ఉండాలని.. అవసరమైతే ఎల్‌కేజీ, యూకేజీలు కూడా వీటిలో నిర్వహించాలని తీర్మానించారు. ప్రాథమిక విద్యాభ్యాసం మాతృ భాషలో జరగాలని తీర్మానించారు. హైస్కూల్‌లో రెండు మీడియంల్లో బోధన కొనసాగాలన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్య దర్శి గిరిధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం, సాంకేతిక స్పృహ పెంచాలని ఆయన కోరారు.



వేదికపై నేనొక కవిత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

## పలు తీర్మానాలు

ముగింపు సభలో పలు తీర్మానాలు చేశారు. సీపీఎస్ రద్దు చేయాలని, 117 జీవో రద్దు చేయాలని తీర్మానించారు. ప్రాథమిక పాఠశాల వ్యవస్థ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు పునరుద్ధరించాలని, హైస్కూల్‌లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంల్లో కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులు కల్పించాలి. 12వ నూతన వేతన సవరణ సంఘం నియమించాలి. మధ్యంతర భృతి వెంటనే చెల్లించాలని తీర్మానించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. ఉపాధ్యాయులపై ఉన్న యాప్స్ భారం తగ్గించాలి. ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ విద్యను బలోపేతానికి చర్యలు తీసుకోవాలి. జాతీయ నూతన విద్యావిధానం 2020ను రద్దు చేయాలి. కామన్ సర్వీస్ రూల్స్ సాధన, జూనియర్ లెక్చరర్స్ పదోన్నతులు, మున్సిపల్ టీచర్లు, ట్రైబుల్ వెల్ఫేర్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తీర్మానించారు. ఇలా మొత్తంగా 15 తీర్మానాలు చేశారు. సభ ఏకగ్రీవంగా వాటిని ఆమోదించింది. అనంతరం యూటీఎఫ్ సాంస్కృతిక పోటీల్లో విజేతలకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు అందజేశారు.

## నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు

నూతనంగా ఎన్నికైన యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గానికి ఎమ్మెల్సీలు గోపిమూర్తి, కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపి ఉపాధ్యాయుల సమస్యల కోసం నిరంతరం పోరాటాలు చేయాలని ఆకాంక్షించారు. మహాసభలు విజయవంతంఅవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

## ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహా సభలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, చక్రవర్తిలు ధన్యవాదాలు తెలిపారు. అన్ని కార్యక్రమాలు విజయవంతానికి కృషిచేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.




వేదికపై పాటలు పాడుతున్న ఉపాధ్యాయ బృందం

### మహా చైతన్యం నింపాయి



కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు 20వేల మంది ఉపాధ్యాయుల్లో మహా చైతన్యం నింపాయి. ఉపాధ్యాయులందరూ ఒకే చోట చేరి విజ్ఞానం పంచుకున్నాం. ఇలాంటి సభలు నిర్వహించడం వల్ల విద్యావికాసం జరుగుతుంది. ఇక్కడే 25ఏళ్ల క్రితం రజతోత్సవాలు, ఇప్పుడు స్వర్ణోత్సవాలు జరగడం విశేషం.

ఐ.ప్రసాద్‌రావు, ఉపాధ్యాయుడు, కాకినాడ జిల్లా

### విజ్ఞానం వెల్లి విరిసింది



స్వర్ణోత్సవాల్లో భాగంగా జరిగిన విద్యా వైజ్ఞానిక సదస్సుల వల్ల ఉపాధ్యాయుల్లో విజ్ఞానం వెల్లి విరిసింది. కొత్త స్ఫూర్తిని ఇచ్చింది. జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రఖ్యాతగాంచిన విద్యావేత్తలు, మేధావులు వచ్చి సరికొత్త విషయాలు తెలియజేశారు. సమాజంలో ఎదుర్కొంటున్న సవాళ్లకు అనుగుణంగా విద్యార్థులకు బోధన ఎలా చేయాలో నేర్పించారు.

సీహెచ్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు, తూర్పుగోదావరిజిల్లా

### మహిళా వికాసానికి నాంది



యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహిళా సాహితీ సదస్సు మహిళల వికాసానికి నాంది పలికింది. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో మహిళా ఉద్యమ నేతలు వివరించారు. మహిళా రచనలు, మహిళల సాహిత్యం ఎంతో ఆకట్టుకుంది.

బి.చంద్రకళ, ఉపాధ్యాయురాలు, కోనసీమజిల్లా

ఫిబ్రవరి 1 నుంచి

# భూముల మార్కెట్ విలువ పెంపు



ముమ్మిడివరంలో రికార్డులు పరిశీలిస్తున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ

ముమ్మిడివరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): భూముల మార్కెట్ విలువ పెంపునకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్‌లకు జూమ్ మీటింగ్ నిర్వహించి దశా దిశా నిర్దేశించినట్టు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ బీశివరామ్ తెలిపారు. ముమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో ఆయన మాట్లాడుతూ భూముల మార్కెట్ విలువ పెంపు విషయంపై తహశీల్దార్లు, వీఆర్వోలు, నగర పంచాయతీ అధికారులు, ఆర్ఐలు, బిల్ కలెక్టర్లతో చర్చించి రీ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించామన్నారు. వారికి ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తామన్నారు. ఈనెల 10వ తేదీ వరకు రీ వెరిఫికేషన్ కొనసాగుతుందన్నారు. జనవరి 17న ఫైనల్‌గా అప్రూవల్ తీసుకోవడం జరుగుతుందని, కమిటీ చైర్మన్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్, సభ్యునిగా మున్సిపల్ కమిషనర్, సబ్‌రిజిస్టర్ కన్వీనర్‌గా ఉంటారన్నారు. 18న డేటా ఎంట్రీ జరుగుతుందని, అభ్యంతరాల స్వీకరణ కోసం ప్రజల ముందు ఉంచడం జరుగుతుందన్నారు. 24న అభ్యంతరాలు స్వీకరిస్తామని, 25న ఫైనల్ వాల్యూస్ కమిటీ అప్రూవల్ చేస్తుందన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పెంచిన నూతన రేట్లు అమలులోకి వస్తాయని ఆయన తెలిపారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ ఎం.సుధాకరరావు, సిబ్బంది ఉన్నారు.

# కత్తితో పదో తరగతి విద్యార్థి హల్‌చల్

ఇంటర్ విద్యార్థిని

చంపుతానని బెదిరింపు

గొల్లప్రోలు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని చంపుతానని బెదిరించడమే గాక, కత్తితో హల్‌చల్ చేసిన పదో తరగతి విద్యార్థిపై గొల్లప్రోలు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా చెందుర్తి గ్రామానికి చెందిన బాలుడు గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన బాలిక గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఆమె గురించి పదో తరగతి విద్యార్థి తప్పుగా ప్రచారం చేయడంపై గొల్లప్రోలు బాలికోన్నత పాఠశాల వద్దకు వచ్చిన బాలుడిని విద్యార్థిని ప్రశ్నించింది. దీంతో ఆగ్రహించిన పదో తరగతి విద్యార్థి ఆమెపై దాడికి ప్రయత్నించాడు. స్థానికులు అడ్డుకోవడంతో సంచిలో నుంచి కత్తిని తీసి బెదిరించాడు. విద్యార్థినిని చంపేస్తానంటూ వీరంగం చేశాడు. దీంతో స్థానికులు బాలుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అక్కడ పుస్తకాల బ్యాగు, కత్తి వదిలివేసి పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

# 12,19 తేదీల్లో ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు

పిఠాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12, 19వ తేదీల్లో ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు జరగనున్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 12న ఇండియన్ రౌండ్ విభాగంలో జూనియర్స్ బాలబాలికలకు ఉదయం 8గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఎస్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు తెలిపారు. జూనియర్స్ రికర్వ్ బాయ్స్ అండ్ గరల్స్ విభాగంలో పోటీలు ఈనెల 19న రాజమహేంద్రవరం మోడల్ కాలనీ ఆర్చరీ ట్రైనింగ్ సెంటర్‌లో జరుగుతాయని చెప్పారు. పోటీల్లో ప్రతిభ కనబరచినవారిని రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఆర్చరీ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఆర్చర్స్ ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం జిరాక్స్ తీసుకురావాలని చెప్పారు. పోటీల్లో పాల్గొనదలిచినవారు 2004 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ 9989001162లో సంప్రదించాలని సూచించారు.

# కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

కాకినాడ క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా పురుష అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలు 8వ రోజైన బుధవారం కూడా కొనసాగాయి. ఈ పరీక్షల్లో(పీఎంటీ, పీఈటీ) మొత్తం 350మంది పురుష అభ్యర్థులు హాజరు కాగా తదుపరి పరీక్షకు 260మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు బుధవారం ఈ దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వీటిని కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పర్యవేక్షించారు.

# కె.పెదపూడిలో ఉద్రిక్త పరిస్థితులు

సంక్రాంతి ఫ్లెక్సీ, రంగా విగ్రహం ఏర్పాటుతో వివాదం

భారీగా పోలీసుల మోహరింపు

పోలీస్ పికెట్ ఏర్పాటు



రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం



స్థానికులతో చర్చిస్తున్న అధికారులు

అంబాజీపేట, జనవరి8 (ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీల ఏర్పాటు... రంగా విగ్రహం ఆవిష్కరణతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడిలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కె.పెదపూడి గాంధీ సెంటర్లో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో వారం రోజుల క్రితం సంక్రాంతి శుభాకాంక్షలు పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీని పక్కనే కాపు సామాజిక వర్గానికి చెందిన యువత రెండు రోజుల క్రితం మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ యూత్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ప్రాంతంలో అక్కడ సంక్రాంతి సందర్భంగా భోగి మంటలు వేసే స్థలం కావడంతో వివాదం ముదిరింది. దీంతో మంగళవారం రాత్రి అంబేడ్కర్ విగ్రహం పక్కన కాపు ఉద్యమ నేత వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని కాపు సామాజికవర్గానికి చెందిన వారు ఏర్పాటు చేశారు. దీంతో బుధవారం రెవెన్యూ, పంచాయతీరాజ్ ఉద్యోగులు, పోలీసులు రంగప్రవేశం చేసి రంగా విగ్రహం అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారని ఫిర్యాదు చేశారని ఉద్రిక్తత పరిస్థితుల నడుమ తొలగించారు. అడ్డువచ్చిన కాపు సామాజిక వర్గీయులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే ఈ విషయం మండలవ్యాప్తంగా తెలియడంతో కాపు సామాజీక వర్గీయులు కె.పెదపూడికి చేరుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్ ఐలు శివకృష్ణ, ఏ.చైతన్యకుమార్, సురేంద్ర పోలీస్ బలగాలతో అక్కడికి చేరుకున్నారు. అలాగే ఎంపీడీవో జీవీ సరోవరరావు అక్కడికి చేరుకున్నారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాపు సామాజికవర్గీయులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొర్లపాటి గోపి, షైపాల తాతాజీ, స్థానికులు చిక్కం ఏసు, పల్లంరాజు, రాయపురెడ్డి సత్యనారాయణతో సీఐ విద్యాసాగర్, ఎంపీడీవో సరోవరరావు చర్చించారు. కె.పెదపూడి సెంటర్‌లో అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేశారని, వాటిని కూడా తొలగించాలని అప్పుడు రంగా విగ్రహాన్ని తొలగిస్తామని ఆగ్రహించారు. ఓ దశలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వారిని వారించారు. పరిస్థితి మారడంతో ఎంపీడీవో మాట్లాడుతూ త్వరలో శాంతి కమిటీని ఏర్పాటు చేసి ఇక్కడ సమస్యలు, పరిస్థితులు చర్చిద్దామని సూచించారు. అప్పటి వరకు ఏ విగ్రహాలు తొలగించవద్దని, ఎలా ఉందో అలానే ఉంచాలని సూచించారు. దీంతో విషయం సద్దుమణిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కె.పెదపూడి సెంటర్‌లో పికెట్ ఏర్పాటు చేస్తామని సీఐ విద్యాసాగర్ తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అభిమానుల కుటుంబాలకు

# సినీ హీరో రామ్‌చరణ్ రూ.10 లక్షల సాయం



మణికంఠ తల్లికి రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న ప్రతినిధులు



చరణ్ తండ్రి అప్పారావుకు రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొని తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన ఇద్దరు అభిమానుల కుటుంబ సభ్యులకు సినీ హీరో రామ్‌చరణ్ రూ.10లక్షలు ప్రతినిధుల ద్వారా అందజేశారు. బుధవారం కాకినాడ రాజేశ్వరినగర్, అశోక్‌నగర్‌లో గల మృతులు అరవ మణికంఠ, తోకాడ చరణ్‌ల ఇళ్లకు రామ్‌చరణ్ ఆదేశాల మేరకు చిరంజీవి యువత ప్రతినిధులు వెళ్లి చెరో రూ.5 లక్షల వంతున రూ.10 లక్షల చెక్కును మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. మణికంఠ, చరణ్‌ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిరంజీవి యువత ప్రతినిధులు మాట్లాడుతూ చరణ్ అభిమానులు ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం ఎంతో బాధకరమన్నారు. రూ.10 లక్షలను రామ్‌చరణ్ ఆర్‌టీజీఎస్ ద్వారా నగదును బాధిత కుటుంబ సభ్యులకు పంపించారని, నగదు లావాదేవీల వివరాలను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చిరంజీవి యువత ప్రతినిధులు గరగా రామ్, విజ్జన శివ, చింతకాయల చిన్ని, కె.బాబీ, వై.బాబీ తదితరులు పాల్గొన్నారు.

# భర్త మృతి తట్టుకోలేక..

బ్రెయిన్ స్ట్రోక్‌తో భార్య మృతి



సూర్యప్రకాశరావు, భాగ్యలక్ష్మి (ఫైల్)

కె.గంగవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భర్త అకాల మరణం జీర్ణించుకోలేక భార్య మృతిచెందిన సంఘటన అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలో జరిగింది. నాళం సూర్యప్రకాశరావు(సూరిబాబు)(54), సూర్యవెంకట భాగ్యలక్ష్మి (బంగారమ్మ)(48) భార్యాభర్తలు. వారు అముజూరు గ్రామంలో నివాసం ఉంటున్నారు. పాణింగపల్లి గ్రామంలో కిరాణా షాపు నిర్వహించుకుని జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సూరిబాబు ఈనెల 1న అనారోగ్యంతో మృతిచెందాడు. భర్త మృతితో తీవ్ర మనోవేదనకు గురైన బంగారమ్మ అయన లేని జీవితాన్ని జీర్ణించుకోలేకపోయింది. దుఃఖంతో కుంగిపోయింది. మంగళవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందింది. భార్యాభర్తలు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

# 160 కోడి కత్తులు స్వాధీనం

ఏలేశ్వరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం సర్కిల్ పరిధిలో 160 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌డీపీవో శ్రీహరిరాజు తెలిపారు. ఏలేశ్వరం పోలీస్ స్టేషన్లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాలతో ఎస్ఐ రామలింగేశ్వరరావుకు వచ్చిన సమాచారం ఆధారంగా దిబ్బలపాలెంలో చర్యలు చేపట్టామన్నారు. ఎదురాడ మల్లేశ్వరరావు అనే వ్యక్తి నుంచి కోడి పందాలకు ఉపయోగించే 160 కత్తులను స్వాధీనపర్చుకుని అతడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. సంక్రాంతి పేరుతో అనధికారికంగా జూదాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. కోడి పందేలు నిర్వహించేవారిని, పాత కేసుల్లో నిందితుల్ని బైండోవర్ చేస్తామన్నారు.

# గంజాయితో వ్యక్తి అరెస్టు

మోతుగూడెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం డొంకరాయిలో గంజాయి లిక్విడ్‌తో పాటు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ అమిత్ బర్దర్, చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా, చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం డొంకరాయి ఎస్ఐ శివకుమార్ తన సిబ్బందితో డొంకరాయి గ్రామ శివారున శ్రీవనదుర్గ అమ్మవారి ఆలయం వద్ద హైదరాబాద్‌కు చెందిన రాహుల్ చంద్ర కాప్రి అనుమానాస్పదంగా ఉండడంతో పట్టుకున్నారు. మధ్యవర్తులు, లక్కవరం ఎఫ్ఆర్‌ఓ వెంకట నానాజీ సమక్షంలో పరిశీలించగా అతడి వద్ద రూ.5లక్షలు విలువ చేసే 2 కిలోల లిక్విడ్ గంజాయి ఉన్నట్టు గుర్తించి అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు.

# కుమార్తె మరణవార్త విని...

తండ్రికి గుండెపోటు



గంగాభవానీ (ఫైల్)

కొత్తపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కుమార్తె మరణ వార్త తెలిసి తండ్రి గుండెపోటుకు గురైన సంఘటన కాకినాడ జిల్లా ఉప్పాడలో జరిగింది. గ్రామస్థులు సమాచారం మేరకు... స్థానిక రామిశెట్టిపేటకు చెందిన రామిశెట్టి గంగాభవానీ(18) కృష్ణాజిల్లా తాడిగడప శ్రీచైతన్యకాళాశాలలో నీట్ కోచింగ్ తీసుకుంటుంది. బుధవారం భవానీ గుండెపోటుతో మరణించిందని శ్రీచైతన్యకళాశాల నుంచి వేమన్నకు సమాచారం అందింది. అతడికి విపరీతమైన గుండెనొప్పి రావడంతో స్థానికంగా చికిత్స చేయించి కాకినాడకు తరలించారు.

# రేపు వాడపల్లిలో ఉత్తర ద్వార దర్శనం



వాడపల్లి వెంకన్న ఆలయంలో ఏర్పాట్ల దృశ్యం

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

ఆత్రేయపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులకు ఈ నెల 10 శుక్రవారం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్టు ఆలయ ఉప కమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులకు వైకుంఠ ద్వారా స్వామిని దర్శించుకునే ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆలయాన్ని ఫలపుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సప్త ద్వారాల గుండా శ్రీమహావిష్ణుమూర్తి శేషపాన్పుపై భక్తులకు అభయ హస్తం అందించనున్నారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తులకు వైకుంఠ ద్వార దర్శన ప్రవేశం కల్పిస్తూ ఏర్పాట్లు చేపడుతున్నారు. గరుడ వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం కన్నుల పండుగగా నిర్వహించనున్నారు.

# ప్రతిచోట సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలి

అన్నవరం దేవస్థానం ఈవో



అన్నదాన విభాగంలో భక్తుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి సత్యదేవుడి సన్నిధికి వచ్చే భక్తులు ఎక్కడా ఇబ్బందిపడకుండా అన్నవరం విచ్చేసినప్పటి నుంచి తిరుగు ప్రయాణమయ్యే వరకు ప్రతిచోట సైన్‌బోర్డులు ఏర్పాటుచేయాలని ఈవో సుబ్బారావు ఆదేశించారు. వాటి ద్వారా భక్తులు ఎవ్వరినీ సంప్రదించకుండా నేరుగా వ్రతాలు, దర్శనాలు పూర్తిచేసుకోవచ్చన్నారు. బుధవారం రత్నగిరిపై పీఆర్వో, రిసెప్షన్, వ్రతమండపాలు, అన్నదాన విభాగాలను ఆయన పరిశీలించారు. యాగశాల వద్ద ఏర్పాటుచేసిన బోర్డు స్పష్టంగా లేకపోవడంతో సరిచేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అన్నప్రసాదం స్వీకరించే భక్తులను దేవస్థానం అన్నదానంలో రుచి, శుచి ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. భక్తుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, సూపరెంటెండెంట్‌లు మూర్తి, ఐవీ రామారావు పాల్గొన్నారు.

# జేఎన్టీయూకే వీసీ నియామకానికి సెర్చ్ కమిటీ

జేఎన్టీయూకే, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ఉపకులపతి నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీని నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యావిభాగం కార్యదర్శి కోన శశిధర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీలో ముగ్గురు విద్యావేత్తల పేర్లు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున నామినీగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్వపు వీసీ ప్రొఫెసర్ కె.నిరుపరాణిని, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తరుపున నామినీగా జేఎన్టీయూహెచ్ పూర్వపు వీసీ ప్రొఫెసర్ డీఎన్ రెడ్డిని, యూజీసీ నామినీగా మద్రాస్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీజీహినాధన్‌కామకోటిని నియమించారు. ఈ నామినీలు జేఎన్టీయూకే ఉపకులపతి పదవి కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ముగ్గురు పేర్లను గవర్నర్‌కు పంపుతారు. జేఎన్టీయూకే ఉపకులపతిగా వాటిలోని ఒకరి పేరును గవర్నర్ ఖరారుచేస్తారు. అయితే వీసీ పదవి కోసం జేఎన్టీయూకే నుంచి సుమారు 20 మంది వరకూ ప్రొఫెసర్లు దరఖాస్తు చేసినట్టు సమాచారం. ప్రస్తుతం వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా కేవీఎస్‌జీ మురళీకృష్ణ కొనసాగుతున్నారు.

# వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూమ్ ప్రారంభం

కాకినాడ సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ మెయిన్‌రోడ్ ఫులవర్తివారివీధిలో వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూమ్ ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ప్రత్యేక అతిథిగా కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) విచ్చేశారు. కాకినాడ షోరూమ్ భూయజమాని పాబోలు బాబూరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, తుని షోరూమ్ భూయజమాని గ్రంధి నారాయణరావు(బాబ్జి) పాల్గొన్నారు. సంఘ సేవకుడు సోము దుర్గాప్రసాద్ మొదటి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వైశ్యరాజు జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతమైన కాకినాడలో తమ షోరూమ్‌ను ఎప్పటి నుంచో ప్రారంభించాలనుకున్నామని, ఇప్పుడు పండుగ మాసంలో కుదరరడం చాలా సంతోషంగా ఉందన్నారు. వినూత్నమైన కలెక్షన్లతో ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్నిరకాల 22 కేటీ బంగారు ఆభరణాలను ఫ్లాట్ 6శాతం తరుగుకే పొందవచ్చన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరి లేదన్నారు. జీఎస్‌టీని కూడా కొనుగోలుదారుల తరపున తామే చెల్లిస్తామన్నారు. అదనంగా వెండి వస్తువుల కొనుగోలుపై కిలోకి రూ.10వేల తగ్గింపు ఉంటుందని, ఈ ఆఫర్ కొన్ని రోజులు మాత్రమేనన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్ రాజు, వైశ్యరాజు కిరణ్‌కుమార్ రాజులతో పాటు పి.వెంకట నాగసూర్య పున్నయ్య, పి.వెంకట సింహాచలం, గుల్లపూడి నందు, పేకేటి ఈశ్వర్లు కాకినాడ నగర మాజీ మేయర్ సుంకర పావని తిరుమలకుమార్, కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణకుమార్, నగరనాయకుడు నున్న దొరబాబు పాల్గొన్నారు.



షోరూమ్‌ను ప్రారంభించిన ఎంపీ ఉదయ్

### వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు
అంతర్వేది, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఉదయం 6.30నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం చేసుకోవచ్చన్నారు.

### నీలిమకు ఆర్థిక సాయం
అంతర్వేది, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలంక గ్రామానికి చెందిన మార్గాని నీలిమ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నందున ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం ఎన్నారై దొండపాటి శశికిరణ్ రూ.10వేలు పంపించారు. ఈమొత్తాన్ని ఆయన తల్లి, సఖినేటిపల్లి జడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ బుధవారం నీలిమ తండ్రికి అందజేశారు.

## సొసైటీ త్రిసభ్య కమిటీలు ఎంపిక పూర్తి

- మూడు జనసేన, మూడు టీడీపీ చైర్మన్లకు ఎమ్మెల్యే గిడ్డి ఎంపిక పత్రాలు అందజేత


పి.గన్నవరంలో సొసైటీ చైర్మన్ ఎంపికను వివరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సొసైటీలకు త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేసి రైతులకు సేవలందించాలనే సంకల్పంతో చర్యలు తీసుకుంది. దీంతో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో కూటమి నేతలు ఒప్పందం ద్వారా మూడు సొసైటీలు జనసేన, మూడు సొసైటీల చైర్మన్లు టీడీపీ కేటాయించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అంబాజీపేట సొసైటీ చైర్మన్ ఎంపికలో ఎన్నో రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అనంతరం టీడీపీ, జనసేన నేతలు చర్చలు, సమావేశాలు జరిపి జనసేనకు కేటాయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అంబాజీపేట సొసైటీ చైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన అరిగెల సూరిబాబు, గంగలకుర్రు సొసైటీ చైర్మన్‌గా గంగలకుర్రు అగ్రహారం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నేత అల్లాడ రవి, ముక్కామల సొసైటీ చైర్మన్‌గా పసుపల్లి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నేత కుడుపూడి రాంబాబు, పుల్లేటికుర్రు సొసైటీ చైర్మన్‌గా అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దొమ్మేటి సురేష్‌కుమార్, ఇరుసుమండ సొసైటీ చైర్మన్‌గా అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సుంకర గణపతిరావు, చిరతపూడి సొసైటీ చైర్మన్‌గా అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రంపం సత్యనారాయణ పేర్లను దాదాపు ఖరారు చేశారు. ఈమేరకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఎంపికైన చైర్మన్లకు నియామక పత్రాలను అందించారు. అలాగే మిగిలిన సభ్యులను ఆయా సొసైటీల పరిధిలో ఎంపిక చేశారు. త్వరలో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందించిన వెంటనే ఆయా సొసైటీ చైర్మన్లు బాధ్యతలు స్వీకరిస్తారు. ఇప్పటికే సొసైటీ చైర్మన్లగా ఎంపికైన వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి సత్కారాలు అందుకున్నారు.

## 12న జోనల్‌స్థాయి బాడీబిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలు


జోనల్‌స్థాయి బాడీబిల్డింగ్ పోటీల ట్రోఫీలు ఆవిష్కరిస్తున్న వెంకన్నాయుడు తదితరులు

అమలాపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా ఈనెల12న కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్, హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ సంయుక్త ఆధ్వర్యంలో తొలిసారిగా యునైటెడ్ డిస్ట్రిక్ట్ జోనల్ బాడీ బిల్డింగ్ అండ్ ఫిజిక్ స్పోర్ట్స్-2025 పోటీలను అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు తెలిపారు. ఈపోటీలకు ఈవెంట్ ఆర్గనైజర్‌గా మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు వ్యవహరిస్తున్నారు. బుధవారం స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు అధ్యక్షతన చాంపియన్‌షిప్ ట్రోఫీల ఆవిష్కరణ నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి కంకిపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జోనల్ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి సుమారు 250మందికిపైగా బాడీబిల్డర్లు పాల్గొంటారన్నారు. నాలుగు విభాగాల్లో మొత్తం పది కేటగిరీల్లో పోటీలు జరుగుతాయి. మెన్స్ విభాగంలో 55కిలోలు, 60, 65, 70, 75, 75 కిలోలు పైబడిన విభాగం, మాస్టర్స్, దివ్యాంగులు విభాగాల్లో పోటీలు జరుగుతాయి. విజేతలకు నగదు పురస్కారాలతో పాటు మెరిట్ సర్టిఫికెట్లు, షీల్డులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, ఆశెట్టి ఆదిబాబు, కమిటీ సభ్యులు మట్టపర్తి సముద్రం, నార్ని శ్రీను, చిక్కం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ

- జాతీయ స్థాయి ప్రదర్శనకు జిల్లా నుంచి నాలుగు ప్రాజెక్టులు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న సమగ్రశిక్ష పీడీ శ్రీనివాసరావు తదితరులు

అమలాపురం రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో కోనసీమ జిల్లా విద్యార్థులు ప్రాజెక్టుల రూపకల్పనతో సత్తా చాటారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఆరు ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచగా నాలుగు ప్రాజెక్టులు జాతీయస్థాయి ప్రదర్శనకు తొలిసారిగా ఎంపిక కావడం విశేషమని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. విజయవాడ మురళీ రిసార్ట్స్‌లో బుధవారం రాష్ట్ర స్థాయి దక్షిణ భారత విజ్ఞాన ప్రదర్శనలో భాగంగా రాష్ట్రం నలుమూలల నుంచి ఉత్తమమైన 156 ప్రాజెక్టులను ప్రదర్శనకు ఉంచారు. ఈప్రాజెక్టుల్లో 35ప్రాజెక్టులను జాతీయ స్థాయికి ఎంపిక చేయగా కోనసీమ జిల్లాకు చెందిన నాలుగు ప్రాజెక్టులు వాటిలో ఉన్నాయి. వ్యక్తిగత విభాగంలో జిల్లా నుంచి గోడి గురుకుల పాఠశాల విద్యార్థులు రూపొందించిన మేజిక్ అంబ్రెల్లా ప్రాజెక్టు, ఊబలంక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన రైన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్, సామూహిక విభాగంలో వన్నెచింతలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన మల్టీపర్పస్ టూల్ మిషన్, ఉపాధ్యాయ విభాగంలో తొండవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన వేస్ట్ టూ వెల్త్ ప్రాజెక్టులు ఉత్తమమైనవిగా ఎంపిక చేశారు. ఈనాలుగు ప్రాజెక్టులను జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్టు సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఎం.వెంకటకృష్ణారెడ్డి, స్టేట్ నోడల్ సైన్స్ కోఆర్డినేటర్ నాగమణి ప్రకటించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. 85శాతం స్ట్రైకింగ్ రేటుతో అత్యధిక ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికై జిల్లాగా ఖ్యాతిని గడించినట్టు సైన్స్ అధికారి గిరజాల వీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. విద్యార్థులను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జాయింట్‌కలెక్టర్ టి.నిషాంతి, డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా అభినందించారు.

## సీఎం సహాయనిధి పంపిణీలో రెండో స్థానం

**ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ**

పి.గన్నవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పంపిణీలో పిఠాపురం నియోజకవర్గం మొదటి స్థానంలో ఉంటే పి.గన్నవరం రెండోస్థానంలో ఉందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందన్నారు. పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో బుధవారం 24మంది లబ్ధిదారులకు రూ.11.30లక్షల చెక్కులు, ఇద్దరికి ఎల్‌వోసీలను ఆయన అందించారు. ఇప్పటివరకు ఐదు విడతలుగా రూ.56.84లక్షలు బాధిత కుటుంబాలకు అందించామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, దాసరి వీరవెంకట సత్యనారాయణ, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, బొంతు పెదబాబు, చెరుకూరి గోపాలకృష్ణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, తోలేటి సత్తిబాబు, జాలెం శ్రీనివాసరాజా, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, చిట్టూరి శ్రీనివాసరావు, దొమ్మేటి సాయి కృష్ణ, పోలిశెట్టి రాజేష్, వాసంశెట్టి కుమార్, గణపతి వీరరాఘవులు, పెచ్చెట్టి పెద్ద, యల్లమిల్లి చిట్టిబాబు పాల్గొన్నారు.

## మానవతా వాదాన్ని చాటిన వేమన పద్యాలు

అమలాపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వేమన పద్యాలు వ్యక్తిత్వ వికాసంతో పాటు మానవతా వాదాన్ని చాటాయని అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నూకల శ్రీనివాస్ పేర్కొన్నారు. వేమన ఫౌండేషన్, ఎస్కేబీఆర్ కళాశాల తెలుగు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో వేమన పద్య పోటీలు ప్రిన్సిపాల్ అధ్యక్షతన నిర్వహించారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి మాట్లాడుతూ బ్రిటీషు అధికారి సీపీ బ్రౌన్ మరుగున పడి ఉన్న వేమన పద్యాలను సమాజానికి పరిచయం చేసి తెలుగు సాహిత్య వికాసానికి విశేష కృషి చేశారన్నారు. వేమన పద్యాల్లో ఉండే లోక రీతి, నీతి, సంఘ సంస్కరణ తదితర అంశాలపై అధ్యాపకులు గోపాల్, డాక్టర్ కేటీ పద్మజ వివరించారు. పోటీల్లో విజేతలైన కె.బాబి, కె.సురేష్‌కుమార్, కె.సుమ తదితరులకు జ్ఞాపికలు అందజేశారు.

### అభ్యంతరాల స్వీకరణ గడువు పెంపు
అమలాపురం,జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీల జనాభా వివరాలతో సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి తెలిపారు. ఎస్సీ కులగణన వివరాలను గత డిసెంబరు 26నుంచి గ్రామ,వార్డు సచివాలయాల్లో ప్రదర్శించామన్నారు. అభ్యంతరాల స్వీకరణకు గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించారన్నారు. 16వరకు అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర వివరాల సేకరణ అనంతరం 20న కులగణన తుది వివరాలను గ్రామ,వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తామన్నారు.

### సంక్రాంతి సంబరాలు
రాజోలు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కళాశాల కల్చరల్ కోఆర్డినేటర్ శైలజ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పిండివంటలు, సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు అలరించారు. ప్రిన్సిపాల్ సాయిబాబు, వైస్‌ప్రిన్సిపాల్ పద్మనాభం పాల్గొన్నారు.

## ఉద్యమ బాట పట్టిన సహకార ఉద్యోగులు


జిల్లా సహకార అధికారి మురళీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న సహకార ఉద్యోగులు

అమలాపురం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేస్తామని ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 36ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సహకార ఉద్యోగులు బుధవారం నుంచి ఆందోళన బాట పట్టారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఫిబ్రవరి 10వరకు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని యూనియన్ జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు తెలిపారు. సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. 9న పార్లర్ రన్‌తో పాటు అన్ని కంప్యూటర్ వర్కులు నిలుపుదల చేస్తామన్నారు. 10న డీసీసీబీ ప్రధాన కార్యాలయం ఎదుట, 20న కలెక్టరేట్ ఎదుట ధర్నాలు నిర్వహిస్తామన్నారు. 27న రాష్ట్ర సహకారబ్యాంకు విజయవాడ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిస్తామని, అప్పటికే సమస్యలు పరిష్కారం కాకపోతే ఫిబ్రవరి 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈమేరకు వినతిపత్రాన్ని జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణకు అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెంచే సత్యనారాయణ, ఉప ప్రధాన కార్యదర్శులు కుంపట్ల అయ్యప్ప నాయుడు, మట్టపర్తి జయరామ్, కోశాధికారి బొబ్బా రామసుబ్రహ్మణ్యచౌదరి పాల్గొన్నారు.

### తాగునీటి అవసరాలు తీరుస్తా: ఎమ్మెల్యే దేవ
మలికిపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. అడివిపాలెం, శంకరగుప్తం గ్రామాల్లో జలజీవన్ మిషన్ నిధులతో నూతనంగా నిర్మించిన మంచినీటి వాటర్ ట్యాంకులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి సమస్యలు లేకుండా తాను ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నట్టు తెలిపారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, సర్పంచ్ ఆనందకుమార్, కొల్లు అనంతలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### క్రీడలతో మానసిక ఉల్లాసం
అంబాజీపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న క్రీడోత్సవ పోటీలను బుధవారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రభుత్వం క్రీడా పోటీలను నిర్వహిస్తుందన్నారు. క్రీడాకారులను డీఈవో పరిచయం చేసుకున్నారు. ఎంఈవో కె.వెంకటేశ్వరరావు, హెచ్ఎం కె.సాయిరామ్, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం
అమలాపురంరూరల్, జనవరి8(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ఉదయం 10.30 నుంచి 11.30గంటల వరకు ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను సెల్ 9581932678కు ఫోన్ చేసి తెలియచేయవచ్చన్నారు.

### నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి
పి.గన్నవరం, జనవరి8(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. ముంగండ హైస్కూల్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని హైస్కూల్స్‌కు పదో తరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేశామన్నారు. ఎస్‌సీఈఆర్టీ విడుదల చేసిన మోడల్ పరీక్షా పత్రాల ఆధారంగా విద్యార్థులకు నమూనా పరీక్షలు నిర్వహించాలన్నారు. సమ్మెటివ్-1 ఆధారంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు జి.కనకదర్గకు విద్యార్థుల విషయంలో తీసుకోవల్సిన పలు అంశాలను డీఈవో సూచించారు.

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం
కాట్రేనికోన, జనవరి8(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల10న లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కాట్రేనికోన, కుండలేశ్వరం, నడవపల్లి, దొంతికుర్రు, కందికుప్ప, పల్లం, పల్లంకుర్రు, మొల్లేటిమొగ, బలుసుతిప్ప గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

## ముగిసిన ఫలపుష్ప ప్రదర్శన


గవర్నర్ కైలాష్‌నాథన్‌తో ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్

యానాం, జనవరి 8: స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పర్యవేక్షణలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అధ్యక్షతన మూడు రోజులుగా జరుగుతున్న యానాం ప్రజాఉత్సవాలు, ఫలపుష్ప ప్రదర్శన బుధవారంతో ముగిశాయి. తూర్పుగోదావరి జిల్లా కడియం, రాజమహేంద్రవరం, బెంగళూరు, పూణే తదితర ప్రాంతాల నుంచి యానాం వ్యవసాయ శాఖ, మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలను తీసుకువచ్చి ప్రదర్శనలో ఉంచారు. పుష్ప-2చిత్రంలో హీరో అల్లు అర్జున్ ఉపయోగించిన ఎడ్ల బండిని ఎర్రచందనం కర్రతో చేసి ప్రదర్శనలో ఉంచారు. ఈఎడ్లబండి ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. ఆవుదూడ, ఎడ్ల బండి, రైతు నాగలి, ద్రాక్ష పళ్లతో తయారు చేసిన గుర్రం ఆకట్టుకున్నాయి. హెచ్‌టిస్పెషల్‌రోజ్, క్రైసాసమయ, చామంతి, పాయిబేటియా, థాయిలాండ్ వెరైటీ, ఫైర్‌బాల్, జీరాబారా, స్పోరియా విత్ పాయిన్‌సిటియా, కులంచో, జెరినియా, ఇం పోసెన్స్, మ్యారీగోల్డ్ (వివిధరకాల బంతి), బోగో నియా, వ్యాసోనియా, డెన్‌డ్రాబియా, జిమియా, హెలోషియా, పాప్‌లైట్స్, డాలియా తదితర జాతుల దేశవిదేశీ పుష్పాలు ఒకేచోట ప్రదర్శనలో ఉంచడంతో పూలప్రేమికులు మంత్రముగ్ధులయ్యారు.

### లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఘన స్వాగతం
యానాం ప్రజా ఉత్సవాల్లో పాల్గొనేందుకు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్ బుధవారం యానాం చేరుకున్నారు. యానాం ప్రభుత్వ అతిథి గృహం వద్ద పుదుచ్చేరి పోలీస్ (ఐఆర్‌బీఎన్) నుంచి గౌరవవందన స్వీకరించారు. అనంతరం పర్యాటకశాఖ మంత్రి లక్ష్మీనారాయణ, పరిపాలనాధికారి మునిస్వామి, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా పరిపాలనాధికారి మునిస్వామి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ శాఖల పనితీరు తదితర అంశాలపై చర్చించారు.


గవర్నర్, మల్లాడిని సత్కరిస్తున్న దృశ్యం

### రిలయన్స్ ఉపకార వేతనాలకు ముగ్గురు విద్యార్థినుల ఎంపిక
అమలాపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో రిలయన్స్ ఫౌండేషన్ నిర్వహించిన ఉపకార వేతన పరీక్షల్లో అమలాపురం ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ప్రతిభ చాటి జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ చింతల సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. గత ఏడాది అక్టోబరులో రిలయన్స్ ఫౌండేషన్ ఆన్‌లైన్‌లో జాతీయ ఉపకార వేతన పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షలో కళాశాలకు చెందిన ఎస్.భావన, ఎ.ప్రసన్నవి, సీహెచ్ ప్రజ్ఞలు ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. మూడేళ్ల డిగ్రీ కోర్సు పూర్తి చేసేందుకు వీరికి ఒక్కొక్కరికీ రూ.1.50లక్షలు చొప్పున రిలయన్స్ సంస్థ స్కాలర్‌షిప్ రూపంలో జమ చేస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినులను జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక కావడం పట్ల ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ పి.చలపతిరావు, ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, అధ్యాపకులు, సహచర విద్యార్థులు అభినందించారు.

### పది రోజుల ముందు వాహనాల పన్ను చెల్లించండి: డీటీవో
అమలాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు పన్నులు చెల్లించాల్సిన యజమానులు ఈత్రైమాసిక పన్ను పది రోజులు ముందుగానే చెల్లించాలని జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాస్ విజ్ఞప్తిచేశారు. ఈక్వార్టర్ నుంచి వాహన వెబ్‌సైట్ (నేషనల్ సాఫ్ట్‌వేర్) ద్వారా పన్నులు చెల్లించే కారణంగా ముందుగానే ఆయా వాహన సంబంధిత మండల మ్యాపింగ్, ఈకేవైసీలు వెబ్‌సైట్‌లో నమోదు చేయించుకోవాలని కోరారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లో మోటారు వాహన కేసులు బకాయి ఉన్నచో త్వరితగతిన ఆ రాష్ట్రాల్లోనే అపరాధ రుసుం చెల్లించాలని సూచించారు. లేనిచో ఆన్‌లైన్‌లో ట్యాక్సు తీసుకోరన్నారు. ఈవిషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆఖరి రోజు వరకు ఉండి సాంకేతిక పరమైన సమస్యలతో ఇబ్బంది పడకుండా మోటారు వాహనాల యజమానులు పది రోజులు ముందుగానే పన్నులు చెల్లించడం వల్ల సమస్యలు పరిష్కరించుకోవచ్చునని శ్రీనివాస్ అన్నారు..

### చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలి
అల్లవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థినీ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఉన్నతంగా ఎదిగేందుకు చదువుకోవాలని మాతా రమాబాయి అంబేడ్కర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ పుణ్యమంతుల రజనీ అన్నారు. చదువుతోనే ఉన్నత స్థితికి చేరుకోగలమని గుర్తించాలన్నారు. గోడి సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో రజనీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బుధవారం ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను గుర్తించి ఉన్నతంగా ఎదిగేందుకు విద్యార్థినులు లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు. బాలికా సంరక్షణ చట్టాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ ఎస్.కిరణ్మయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రజనీని సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరమ్మ, ఎస్ఎంసీ సభ్యుడు జంగా శ్రీను, ఫౌండేషన్ సభ్యులు విప్పర్తి లక్ష్మీసరస్వతి, గుర్రాల సుజాత, గోడ భాగ్యలక్ష్మి, గోడ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### లాయర్స్ డైరీ ఆవిష్కరించిన జిల్లా జడ్జి
అమలాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని అమలాపురం బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ ఆవిష్కరించారు. ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆజామ్, సభ్యులు కుడుపూడి అశోక్, అబ్బిరెడ్డి సురేష్, కూచిమంచి శశిశ్రీరామ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీర్ని సాయి, నంబూరి మూర్తి, నల్లా రవిప్రసాద్, అడపా ప్రసాద్, అమిద్ తదితరులు పాల్గొన్నారు.

### బీమా చెక్కుల పంపిణీ
ముమ్మిడివరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రమాదవశాత్తూ గాయపడిన ముమ్మిడివరం నగర పంచాయతీకి చెందిన ఆకుల కరుణ, ఐ.పోలవరం మండలం పాతఇంజరం గ్రామానికి చెందిన రాచకొండ పుల్లయ్యనాయుడులకు జనసేన ప్రమాద బీమా చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కొత్తపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ చెక్కులను అందించారు. ఈసందర్భంగా ఠాణేలంక పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఎన్నికైన గోదశి పుండరీష్‌ను జనసేన పార్టీ నాయకులు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో కడలి ఈశ్వరి, కర్రా దుర్గాప్రసాద్, గోదశి పుండరీష్, దూడల స్వామినాయుడు, మద్దింశెట్టి పురుషోత్తం, ముత్యాల జయలక్ష్మి, అత్తిలి బాబూరావు, మాదాల శ్రీధర్, యలమంచిలి బాలరాజు, గాలిదేవర తమేష్, రంబాల రమేష్, బద్రి రమణ, వక్కపట్ల గణేష్, కామన ప్రసాద్‌గౌడ్, వంగా సీతారామ్, విత్తనాల రవి, గొలకోటి సాయి, సుంకర మణి, గొలకోటి సురేష్, గాలిదేవ గణేష్, విళ్ల రమ్య, సలాది సూరిబాబు, సలాది రాజా, గొలకోటి ఫణి పాల్గొన్నారు.

### కంప్యూటర్ వర్క్‌లు నిలిపివేస్తాం: సహకార ఉద్యోగులు
కాట్రేనికోన, జనవరి 8(ఆంధ్రజ్యోతి): హెచ్ఆర్ పాలసీని అమలు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం ఇప్పటి వరకు అమలుచేయని కారణంగా ఆందోళనకు దిగుతున్నట్టు సహకార ఉద్యోగుల సంఘం ప్రకటించింది. బుధవారం నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహించిన ఉద్యోగులు ఈనెల9న పార్లర్ రన్‌తో పాటు అన్ని కంప్యూటర్ వర్క్‌లు నిలిపివేస్తున్నట్టు సహకార ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు తెలిపారు. 10న డీసీసీబీ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా, 20న కలెక్టరేట్ వద్ద ధర్నా, 27న రాష్ట్ర సహకార బ్యాంకు వద్ద ధర్నా చేస్తామన్నారు. ఫలితం లేకుంటే ఫిబ్రవరి 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామన్నారు. కార్యక్రమంలో సీఈవోలు డి.రామకృష్ణంరాజు, కేఎస్‌వీ ప్రసాద్, జి.నాగేంద్రకుమార్, జి.శ్రీనివాస్, ఏఎస్ ప్రేమేశ్వరరావు, కె.సీతారామారావు పాల్గొన్నారు.

### బుద్ధిస్ట్ పతాక దినోత్సవం
ముమ్మిడివరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ బుద్ధిస్ట్ పతాక దినోత్సవాన్ని నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలోని పోలమ్మచెరువుగట్టున బుద్ధ పార్కులో బుద్ధుని విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహించారు. బుద్ధుని పతాకాన్ని ఆవిష్కరించి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. త్రిచరణ, పంచశీల, అష్టాంగ మార్గాల గొప్పదనాన్ని వక్తలు వివరించారు. బుద్ధిజంలో కులం, మతం, ప్రాంతం, స్త్రీ, పురుష బేధం లేదని, ప్రజ్ఞ, శీల, కరుణలకు ప్రత్యేక స్థానం ఇచ్చి సమసమాజ స్థాపనకు శాస్త్రీయ ఆలోచనలు కలిగినది బుద్ధిజం అని వారు పేర్కొన్నారు. దేశ రాజ్యాంగంలో బుద్ధిజాన్ని నిక్షిప్తం చేయడంలో అంబేడ్కర్ కీలక పాత్ర పోషించారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వడ్డి నాగేశ్వరరావు, కాశి బాబూజగ్జీవన్‌రామ్, కాశి సింహాద్రివర్య, సబ్బతి సత్యనారాయణ, బుడితి నాగేశ్వరరావు, బొజ్జా బాలకృష్ణ పేర్కొన్నారు.

### 'పొలం పిలుస్తోంది'
అంతర్వేది, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మోరి, మోరిపోడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వివిధ ప్రభుత్వ పథకాలు, తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ వీఏఏ, వీహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్యశ్రీ సేవలను వెంటనే పునరుద్ధరించాలి


కలెక్టర్ మహేష్‌కుమార్‌కు అర్జీ అందజేస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు తదితరులు

అమలాపురం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ సేవలను వెంటనే పునరుద్ధరించి రోగులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చూడాలని కాంగ్రెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీకి మంగళం పాడే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని కూటమి ప్రభుత్వం అనారోగ్యశ్రీగా మార్చేసిందని, రూ.3వేల కోట్లు బకాయిలు చెల్లించకపోవడంతో ఈపరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే సంబంధిత ఆసుపత్రుల యాజమాన్యాలను చర్చలకు పిలిచి పెండింగ్ బకాయిలు చెల్లించడంతో పాటు ఆరోగ్యశ్రీని పునరుద్ధరించాలని కోరుతూ బుధవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, పీసీసీ సభ్యుడు మాచవరపు శివన్నారాయణ, నాయకులు గెడ్డం సురేష్‌బాబు, ముషిణి రామకృష్ణారావు, వడ్డి నాగేశ్వరరావు, వంటెద్దు బాబిపాల్గొన్నారు.

### 'నామినేటెడ్ పదవుల్లో గౌడలకు అన్యాయం'
కాట్రేనికోన, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బుధవారం పెనుమల్లెలో జరిగిన గౌడ సామాజిక వర్గం సమావేశంలో కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల పంపకంలో తమకు అన్యాయం చేసిందంటూ గౌడ సామాజికవర్గ నాయకులు వ్యాఖ్యానించారు. నామినేటెడ్ పదవుల కేటాయింపులో మండలంలో గౌడలను పట్టించుకోలేదని నాయకులు అసహనం వ్యక్తం చేశారు. సొసైటీ చైర్మన్ విషయంలో సీనియర్ గౌడ నాయకుడు కొండేటి చినబాబును కాదని వంగా మల్లిఖార్జునరావుకు కేటాయించడంపై ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తీరును సమావేశం వ్యతిరేకించింది. ఈవిషయంలో మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకోకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని గౌడ నాయకులు హెచ్చరించారు.

### యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా విశ్వనాథ్
అంతర్వేది, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా విశ్వనాథ్ రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాధ్యక్షుడుగా, జిల్లా కార్యదర్శిగా, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా, కుటుంబ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా గతంలో పనిచేశానన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, ఉపాధ్యాయులకు రాయితీలు, రావాల్సిన బకాయిల గురించి పోరాడతానని తెలిపారు.

### బాలబాలాజీ మూలవిరాట్‌కు సహస్ర నామార్చన
మామిడికుదురు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస పూజల్లో భాగంగా బుధవారం అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారి మూలవిరాట్‌కు సహస్ర నామార్చన పూజ ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు తులసీదళాలు, వివిధ రకాల చామంతులు, గులాబీలను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చన చేశారు. పలు పూజా కార్యక్రమాల వేదమంత్రోచ్చారణల నడుమ ఘనంగా జరిపారు. పూజా కార్యక్రమాలు ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

### ఉపాధ్యాయుడికి సన్మానం
ఉప్పలగుప్తం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): భీమనపల్లి శ్రీమతిశిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన జనిపెల్ల సత్యనారాయణను బుధవారం సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. పీఎంసీ చైర్మన్ గుర్లింక చిన్నా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ, హెచ్ఎం నూకల సత్యనారాయణ, ఆంధ్రాయూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ నల్లా బాబాయి, అరవ స్వామినాయుడు, రాయి వెంకటేశ్వరరావు, పశ్చిమాల శివనాగరాజు, పి.అనూరాధ, లక్ష్మి, పద్మనాభరాజు పాల్గొన్నారు.

### ఇంటింటా కేన్సర్ సర్వే
ఉప్పలగుప్తం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): భీమనపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం కూనవరంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వ్యాధులపై సర్వే నిర్వహించారు. కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్, సర్వికల్ కేన్సర్, మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్‌లకు సంబంధించి 18ఏళ్లు పైబడిన వారికి స్కాన్ చేశారు. సామాజిక ఆరోగ్య విస్తరణాధికారి రాయుడు రామకృష్ణమూర్తి, సీహెచ్‌వో జ్యోతి, హెచ్ఎ నరసింహం, ఏఎన్ఎం శైలజ, ఆశాలు పాల్గొన్నారు.

### ప్రజలకు వైరస్‌పై అవగాహన కల్పించాలి
రాజోలు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో హెచ్ఎంపీవీ వైరస్ కేసులు వెలుగు చూడడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ కేతా శ్రీను రాజోలు వైద్యాధికారులకు సూచించారు. ఈసందర్భంగా రాజోలు సచివాలయంలో నిర్వహించిన చంద్రన్న సంచార వైద్యసేవ(104)లో కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు చక్కటి వైద్యం అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, డాక్టర్ మానసా సుప్రియ పాల్గొన్నారు.

### 18మందిపై బైండోవర్ కేసులు
అల్లవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిసందర్భంగా కోడి పందాల్లో కోళ్లకు కత్తులు కట్టేవారు,గుండాట నిర్వాహకులు, 18మందిపై బుధవారం బైండోవర్ కేసులు పెట్టామని ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు. బైండోవర్‌కు సంబంధించి 18మందిని తహశీల్దార్ కోర్టులో హాజరుపర్చామన్నారు.

### విశ్వాస్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు
ముమ్మిడివరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం విశ్వాస్ ఒకేషనల్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థినులు కళాశాల ప్రాంగణంలో రంగవల్లులువేసి వాటి మధ్య గొబ్బెమ్మలు పెట్టి భోగి పండుగకు గుర్తుగా పాటలు పాడారు. క్రికెట్, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ఎ.బుజ్జిదొర, ప్రిన్సిపాల్ నక్కా వీరవెంకటసత్యనారాయణ, అధ్యాపకులు పి.కృష్ణ, చిన్నం శ్రీనివాస్, గుత్తుల శ్రీను, కె.విజయకుమారి, ప్రశాంతి, పద్మావతి పాల్గొన్నారు. విజేతలకు సర్వారాయ షుగర్స్ వేమగిరి ఆధ్వర్యంలో డిపోసేల్స్ ఎగ్జిక్యూటివ్ ఎ.రవికుమార్ బహుమతులు అందించారు.

### ముఖ్య కూడళ్లలో నిఘా నేత్రాలు
మామిడికుదురు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో గల ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలను పోలీసులు ఏర్పాటుచేశారు. మామిడికుదురు సెంటర్‌లో 6, గోగన్నమఠం సెంటర్‌లో 6, పాశర్లపూడిలో 2 ఏర్పాటు చేసినట్టు నగరం ఎస్ఐ చైతన్యకుమార్ తెలిపారు. రోడ్లపై జరిగే ప్రమాదాలు, చోరీలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని ఎస్ఐ తెలిపారు. ఇళ్లు, దుకాణాల ముందు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థినులు

## సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల ధర్నా

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యు ఆధ్వర్యంలో బుధవారం రామచంద్రపురం పురపాలక సంఘం కార్యాలయం వద్ద విద్యార్థులు ధర్నా జరిపారు. పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ మేనేజరు పీఎస్ఎన్‌మూర్తికి అందించారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం, చింతా రాజారెడ్డి, విద్యార్థులు అంజలి, సురేఖ, సంహిత, పి.నాగదేవి, రిక్షత, రమణి, సదాలక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.


అంగరలో రహదారిని నిర్మించాలంటూ ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

## రోడ్డు నిర్మించాలంటూ గ్రామస్తుల ఆందోళన

• ఓఎన్‌జీసీ అధికారులు హామీ ఇవ్వాలని డిమాండ్ • రోడ్డుపై వంటా వార్పు

కపిలేశ్వరపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అంగర గ్రామంలో ఓఎన్జీసీకి వెళ్లే రహదారిని నిర్మించాలంటూ ఆ ప్రాంతవాసులు బుధవారం ఓఎన్జీసీ వాహనాలను అడ్డుకుని రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. గ్రామానికి చెందిన పలువురు నాయకులు, మహిళలు మాట్లాడుతూ 4 బావులతో ఓఎన్జీసీ సంస్థ కొన్నేళ్లుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్నారు. అప్పటి నుంచి అధ్వానంగా మారిన రోడ్డును నిర్మించకుండా కాలయాపన చేస్తున్నారని గ్రామానికి చెందిన షేక్ కరీం, పెద్దింశెట్టి సాయికృష్ణ, మట్టా ఏడుకొండలు, ఉండమట్ల వెంకటేశ్వరరావు, మోర్త గనికమ్మ, మన్ని ఉమామహేశ్వరి, మందపల్లి శేషగిరి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఓఎన్జీసీ సామగ్రితో వాహనాలు తిరగడం వల్ల రోడ్డు ఛిద్రంగా మారిందని వారు ఆరోపించారు. ఓఎన్జీసీ వాహనాలను నిలిపివేసి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. సంస్థ ప్రతినిధులు మనోహర్ తదితరులు వచ్చి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పినప్పటికి ఆందోళన విరమించలేదు. రోడ్డు పైనే వంటా వార్పు జరిపి ఆందోళన కొనసాగించారు. అంగర ఎస్ఐ రవికుమార్ పోలీస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆందోళనలో యర్రంశెట్టి నాగేశ్వరరావు, కందుకూరి సత్యం, చాపల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## తాతపూడిలో ఇసుక ర్యాంపు ఏర్పాటు

మండపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గోదావరి ఇసుకను అందుబాటులోకి తీసుకువచ్చింది. నియోజకవర్గ పరిధిలో వున్న కపిలేశ్వరపురంలో ఇప్పటికే ఇసుక ర్యాంపు ప్రారంభమైంది. మరో ర్యాంపును తాతపూడిలో ప్రారంభించేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఇసుక అందుబాటులో ఉండటంతో నిర్మాణ రంగం ఊపందుకుంది. గోదావరిలో ఇసుక కోసం బాటవేసి నేరుగా ట్రాక్టర్‌లు ర్యాంపులోకి వెళ్లేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఇసుక ర్యాంపులు తెరవటంతో జట్టు కూలీలకు ఉపాధి కలుగుతుంది. తాతపూడిలో ఇసుక ర్యాంపు త్వరితగతిన ప్రారంభమైతే ఇక్కడి ప్రజలకు ఇసుక మరింత అందుబాటులోకి రానుంది.


ఇసుక ర్యాంపును సిద్ధం చేస్తున్న దృశ్యం

## అంధుల పాఠశాలకు విద్యార్థుల విరాళం


విరాళం ఇస్తున్నశ్రీసిద్ధార్థ స్కూల్ యాజమాన్యం

ఆలమూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అంధులకు సాయం చేయాలనే దృక్పథంతో విద్యార్థులు చేసిన కృషి అభినందనీయమని శ్రీసిద్ధార్థ హైస్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు అన్నారు. విజయవాడలోని స్నేహ అంధుల పాఠశాలకు శాశ్వత భవన నిర్మాణానికి సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు సేకరించిన రూ.6,70,197 విరాళాన్ని నిర్వాహకులకు బుధవారం ఆయన అందించారు. ఆలమూరు, రావులపాలెం శ్రీసిద్ధార్థ స్కూల్స్ నుంచి ఈ విరాళాలు సేకరించారు. వీటిని స్నేహ అందుల పాఠశాలకు అందించారు. కార్యక్రమంలో స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రభాకరరెడ్డి, ప్రిన్సిపాల్స్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాడపల్లి ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తడంతో రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలను తీర్థపు బిందెతో తీసుకువచ్చి స్నపనమూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై వేద పారాయణం నిర్వహించారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,92,199 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన కోడూరి రంగారావు, సుబ్బలక్ష్మి దంపతులు రూ.1.16 లక్షల విరాళం ఇచ్చారు. దాతలకు ఈవో స్వామివారి చిత్రపటం అందించారు.


దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

## మహిళ బ్యాగులోంచి బంగారు వస్తువుల అపహరణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ బయట బస్సు ఎక్కుతున్న మహిళ బ్యాగులోంచి గుర్తు తెలియని దొంగలు 108 గ్రాముల బంగారు వస్తువులు అపహరించుకుపోయారు. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రపురానికి చెందిన శ్రీరామ రేవతి అనే మహిళ హైదరాబాద్‌లో ఉంటున్నారు. తన స్వగ్రామం వెళ్లేందుకు మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి రైలులో బయలుదేరి బుధవారం రాజమహేంద్రవరం చేరుకున్నారు. రామచంద్రపురం ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నక్రమంలో గుర్తు తెలియని దొంగలు ఆమె హ్యాండ్ బ్యాగ్‌లోని 108 గ్రాముల బంగారు వస్తువులు అపహరించుకుపోయారు. దీంతో బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సైన్సు ఫెయిర్‌కు ఊబలంక విద్యార్థి ప్రాజెక్టు

రావులపాలెం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సైన్సు ఫెయిర్‌కు ఊబలంక జడ్పీ పాఠశాల విద్యార్థి ప్రదర్శించిన ప్రాజెక్టు ఎంపికైనట్టు హెచ్‌ఎం సీహెచ్‌ఎస్ఎన్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 7, 8 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్సు ఫెయిర్ పోటీలకు తమ పాఠశాల నుంచి ఎస్.నిఖిల్ విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నాడన్నారు. ఆటోమెటిక్ రెయిన్ డిటెక్టర్ అండ్ క్లాత్ కటింగ్ మిషన్ ప్రాజెక్టును ప్రదర్శించాడన్నారు. దీంతో ఈ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు. పాండిచేరిలో ఈ నెల 21 నుంచి 25 వరకు జరిగే జాతీయ స్థాయి సైన్సు ఫెయిర్‌లో పాల్గొనడానికి ఎంపిక సాధించారన్నారు. విద్యార్థిని గైడ్ టీచర్లు వి. నాగలక్ష్మి, సీహెచ్ విజయలక్ష్మిలను డీఈవో సలీంబాషా, ఎంపీడీవో మహేశ్వరరావు, ఎంఈవోలు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాసరాజు, జిల్లా సైన్సు అధికారి జీవీ సుబ్రహ్మణ్యం, ఎస్ఎంసీ చైర్మన్ ఎం.సర్వేశ్వరరెడ్డి అభినందించినట్లు ఆయన తెలిపారు.

### అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

కె.గంగవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పామర్రు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్కె జానీబాషా హెచ్చరించారు. సంక్రాంతి నేపథ్యంలో కోడి పందాలు, అశ్లీల నృత్యాలు తదితర కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

### పేకాట శిబిరంపై దాడి

ఆత్రేయపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజవరం గ్రామ శివారున బుధవారం పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,210 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

## పచ్చని చెట్లకు నిప్పు..పర్యావరణానికి ముప్పు

• పర్యావరణ ప్రేమికుల ఆగ్రహం • బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజా వేదికలో ఫిర్యాదు

ఆత్రేయపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం లక్షలాది మొక్కలు నాటుతుంటే, కొంత మంది దుండగులు వాటికి నిప్పుపెట్టి పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారు. ఇటుక బట్టీలకు వాటిని అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందని పర్యావరణ ప్రేమికులు విమర్శిస్తున్నారు. అటవీ విభాగం, సామాజిక వన విభాగం పేరుతో ప్రతి ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఇరువైపులా మొక్కలు నాటుతున్నారు. ఈ వృక్షాలన్నీ జల వనరులశాఖలో చేరాయి. బొబ్బర్లంక నుంచి ఊబలంక, లొల్ల నుంచి ర్యాలి వెళ్లే రోడ్లు పచ్చని చెట్లతో అహ్లాదకరమైన వాతావరణాన్ని తలపిస్తున్నది. ఇటీవల కొంత మంది చెట్లపై గొడ్డలి వేటు వేయడంతో పచ్చదనం కాస్తా కనుమరుగు అవుతోంది. వివిధ ప్రాంతాల్లో చెట్లకు నిప్పుపెట్టి ఆ తర్వాత కట్టెలుగా మార్చి అమ్ముకుంటున్నారని పలువురు పర్యావరణ ప్రేమికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రజాఫిర్యాదుల వేదికలో చెట్లు నరికిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తూ వినతి పత్రం అందించారు.


ర్యాలిలో పచ్చని వృక్షాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

### 'పీఈటీ తీరుపై నేడు విచారణ'

మండపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి) కోనసీమ సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలస్థాయి ఆటల పోటీలు మంగళ, బుధవారాలు ఏడిద రోడ్డులో వున్న ప్రభుత్వ హైస్కూల్లో జరిగాయి. తొలిరోజు పోటీల్లో విధులు నిర్వహించిన సచివాలయ మహిళా పోలీసులు తీరుపై ఒక పీఈటీ దురుసుగా ప్రవర్తించిన సంఘటన చర్చనీయాంశంగా మారింది. తొలిరోజు క్రీడలను చూసేందుకు ప్రజలు అధికంగా వచ్చారు. పోటీల వద్ద పట్టణ పోలీసులతోపాటు, సచివాలయ పోలీసులు విధుల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధం లేని ఒక పీఈటీ సచివాలయ పోలీసులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. మండలంలో జరిగిన క్రీడా పోటీలకు సంబంధించి ఇద్దరు మండల విద్యాధికారులు, మండల పరిషత్ అధికారి పర్యవేక్షణలో జరిగాయి. వాటి పర్యవేక్షణ బాధ్యతలు వారే చూశారు. ఇక్కడ నియమించిన సచివాలయ పోలీసులు విధుల్లో ఉండగా ఒక పీఈటీ సచివాలయ మహిళా పోలీసులపై దురుసుగా వ్యవహరించిన తీరుతో వారంతా ఆగ్రహంతో ఉన్నట్టు తెలిసింది. ఆయన తీరుపై సచివాలయ పోలీసులు, మండల అభివృద్ధి అధికారితోపాటు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ వ్యవహారాన్ని గురువారం చక్కదిద్దుతామని వారికి అధికారులు భరోసా ఇవ్వటంతో వారు శాంతించారు. మొత్తం మీద ఈ వ్యవహారాన్ని చక్కదిద్దే ప్రయత్నం అధికారులు చేస్తున్నట్టు సమాచారం. మండల అధికారి సత్యనారాయణను దీనిపై వివరణ కోరగా ఈ వ్యవహారం తన దృష్టికి వచ్చిందన్నారు. గురువారం వారిని పిలిపించి ఆ తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు.

### దుంపపంట సాగుపై అవగాహన

కొత్తపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఉద్యాన విశ్వవిద్యాలయం, స్థానిక ఉద్యానశాఖ ఆధ్వర్యంలో వానపల్లిలో బుధవారం దుంపపంట సాగులపై రైతులకు అవగాహన చేశారు. శాస్త్రవేత్త డాక్టర్ టి.లలితా కామేశ్వరి పాల్గొని దుంప పంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లి భీమారావు, ఉపసర్పంచ్ వీరేష్, ఉద్యానశాఖాధికారులు రాజు, సౌమ్య, మణికంఠ, ప్రీతి, మౌనిక రైతులు పాల్గొన్నారు.

### శాస్త్రి సేవలు ప్రశంసనీయం

కె.గంగవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): దంగేరు ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసిన బదిలీ అయిన టీవీఎస్. శాస్త్రి సేవలు ప్రసంసనీయం అని వక్తలన్నారు. బదిలీ అయిన శాస్త్రికి మంగళవారం పాఠశాల ఆవరణలో వీడ్కోలు సభ నిర్వహించి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేదునూరు రాజు, ఉపాధ్యాయులు దొంతంశెట్టి శ్రీనివాసరావు, సి.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

### వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ స్వామి వివేకానంద దేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడని అన్నారు. డిగ్రీ విద్యార్థి పి.నవ్య వివేకానంద వేషధారణతో వివేకానంద ప్రసంగంతో ఆకట్టుకుంది. జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు మొక్కలను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

### మహిళలపై దాడులకు నిరసన

మండపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను నిరసిస్తూ తాపేశ్వరం శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులతో బుధవారం బేటిసమాన్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి మండపేట రూరల్ ఎస్ఐ బుజ్జిబాబు హాజరై మాట్లాడారు. పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ విద్యార్థినులు ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### తర్ల్ మెడ్‌లైన్ ఫలితాలను ఆన్‌లైన్ చేయాలి

కె.గంగవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 3, 4, 5 తరగతులకు మంగళ, బుధవారాల్లో నిర్వహించిన మిడ్లైన్ పరీక్ష ఫలితాన్ని ఆన్‌లైన్ చేయాలని సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి పి. రాంబాబు తెలిపారు. బుధవారం ఆయన కూళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. 3, 4, 5 తరగతుల పరీక్ష నిర్వహణను ఆయన పరిశీలించారు.


కొత్తూరు రెవెన్యూ సదస్సులో నినాదాలు చేస్తున్న రైతులు

## రెవెన్యూ సదస్సును బహిష్కరించిన రైతులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణం కొత్తూరులో బుధవారం రెవెన్యూ సదస్సును రైతులు బహిష్కరించారు. కొత్తూరు గ్రామంలో భూముల రిజిస్ట్రేషన్ ధరలు సరిచేయాలని కొన్నేళ్లుగా ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం చూపలేదన్నారు. దీనికి నిరసనగా రెవెన్యూ సదస్సు బహిష్కరిస్తున్నట్లు రైతులు తెలిపారు. తహశీల్దార్ ఎం.సావిత్రి, ఎండోమెంట్ మండల అధికారి శ్రీదేవి, వీఆర్వోలు రెవెన్యూ సదస్సు ప్రారంభించగా మాజీ ఏఎంసీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, గుణ్ణం వినోద్‌కుమార్, గుణ్ణం సూరిబాబు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో రైతులు సదస్సుకు చేరుకున్నారు. ఈరోజు అయిదుగురు సభ్యులతో కమిటీ వస్తుందని సమస్య పరిష్కరిస్తారని తామంతా హాజరయ్యామని వారన్నారు. కమిటీ సభ్యులతో తహశీల్దార్ మాత్రమే రావడంతో నిరసన తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. దరఖాస్తులు ఇవ్వబోమని సదస్సు బహిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు. ఇదే సమస్యపై చర్చించేందుకు జేసీ వద్దకు సబ్‌రిజిస్ట్రార్, మున్సిపల్ కమీషనర్ వెళ్లారని తహశీల్దార్ తెలిపారు.

**ఏసీ గదుల్లో కూర్చుకుని ధరలు నిర్ణయించారు: గరిగిపాటి**

కొత్తూరు వార్డులో 130 ఎకరాలు భూమి ఎకరా భూమి రూ.1.80 నుంచి రూ.5 కోట్లు ధర నిర్ణయించారని అన్నారు. రూ.1.80 కోట్లు ధరతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే రూ.13 లక్షలు రిజిస్ట్రేషన్ ఖర్చవుతుందన్నారు. ఆడపిల్లలకు వివాహాలు చేసుకునేందుకు వారిపేరుతో భూమి రాయడానికి వీల్లేకుండా పోయిందన్నారు. జిల్లా కలెక్టరు వరకు సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. భూముల రిజిస్ట్రేషన్ ధరలు అధికారులు ఏసీగదుల్లో కూర్చుని నిర్ణయించారని విమర్శించారు. కార్యక్రమంలో వెదుళ్ల విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాల కలయికే సంక్రాంతి

కొత్తపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): దేశ సంస్కృతి, సంప్రదాయాల చిహ్నమే సంక్రాంతి అని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రాజు పేర్కొన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని రంగవల్లుల పోటీలు నిర్వహించగా, ఈ పోటీల్లో విద్యార్థినులు కళాశాల ప్రాంగణంలో రంగవల్లులు వేశారు. అనంతరం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.సత్యనారాయణ, సీహెచ్ నాగరాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

**ఆలమూరు:** తక్కువ ఎత్తుతో పుట్టి రికార్డు సృష్టించిన పుంగనూరు దూడ మండపేటలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఆకర్షణగా నిలిచింది. మండపేట మున్సిపాల్టీలో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆలమూరు మండలం గుమ్మిలేరు రైతు రెడ్డి వీరవెంకటసత్యనారాయణకు చెందిన పుంగనూరు దూడను తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ నూకదుర్గారాణి, మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌తో పాటు పలువురు నాయకులు రైతు సత్తిబాబును అభినందించారు.

**రావులపాలెం:** రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు రంగోలి, మ్యూజికల్ చైర్ తదితర పోటీలు జరిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్, అధ్యాపకులు బీవీఎస్ రెడ్డి, హరిబాబు, రజని, సుమలత, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

**కృత్తివెంటి విద్యా సంస్థల ఆధ్వర్యంలో**

**రామచంద్రపురం(ద్రాక్షారామ):** కృత్తివెంటి పేర్రాజు పంతులు విద్యా సంస్థలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రామచంద్రపురం పాన్‌షాపు అసోసియేషన్, వేమగిరి కోకోకోలా బాట్లింగ్ యూనిట్ సౌజన్యంతో విద్యార్థులకు ముగ్గుల పోటీలు జరిపారు. పూర్వ విద్యార్థి గొర్రెల శ్రీనివాస్ హరిదాసు వేషధారణతో అలరించారు. విద్యార్థులు ఆటపాటలతో సంక్రాంతి వేడుకలు జరిపారు. ముగ్గుల పోటీల విజేతలకు మంత్రి సుభాష్ తండ్రి సత్యం బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ గంగరాజు, హెచ్‌ఎం వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సంక్రాంతి సంబరాల్లో ఆకట్టుకున్న గుమ్మిలేరుకు చెందిన పుంగనూరు దూడ

## విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఆలమూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌కె.సలీంబాష అన్నారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండలస్థాయి క్రీడోత్సవాలను బుధవారం ఆయన పరిశీలించారు. క్రీడా పోటీల్లో విద్యార్థుల సంఖ్య తదితర అంశాలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కొద్దిసేపు చర్చించారు. డీఈవో వెంట ఆలమూరు ఎంఈవో భమిడిపాటి అప్పాజీ, పలువురు పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఆటలతో ఒత్తిడిని జయించవచ్చు**

**కొత్తపేట:** ఆటల పోటీల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా ఒత్తిడిని జయించడంతో పాటు ఏకాగ్రత పెరగడానికి దోహదపడుతుందని డీఈవో షేక్ సలీంబాషా పేర్కొన్నారు. బుధవారం రెండవ రోజైన కోనసీమ క్రీడోత్సవంలో భాగంగా జరిగే ఆటల పోటీలను ఆయన పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలను ఆయన అభినందించారు. ప్రతిభ చాటిన విజేతలను జిల్లాస్థాయికి పంపుతామన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేటలో క్రీడా పోటీలను పరిశీలిస్తున్న డీఈవో సలీంబాషా

## ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి


ఆటో యూనియన్ సభ్యులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ హరికోటిశాస్త్రి

మండపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వాహనదారులు, ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ ఎస్ఐ హరికోటి శాస్త్రి తెలిపారు. మండపేట గణేష్ ఆటో యూనియన్ కార్మికులకు బుధవారం ట్రావెల్స్ బంగ్లా వద్ద ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణంలో ట్రాఫిక్ నిబం ధనలు పాటించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గణేష్ ఆటో యూనియన్ సంఘ అధ్యక్ష. ఉపాధ్యక్షులు బొత్స ప్రసాద్, మోరంపూడి విజయకుమార్, సభ్యులు ఆటోడ్రైవర్‌లు పాల్గొన్నారు.

### అభ్యాసనస్థాయి మెరుగుదలకే తర్ల్

రాయవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థుల అభ్యాసనస్థాయిని తరగతుల వారీగా సాధనకు తర్ల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు తెలిపారు. బుధవారం ఆయన కురకాళ్ళపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఆయన వెంట సీఆర్‌పీలు వాసంశెట్టి సీతాధనలక్ష్మి ఉన్నారు.


ర్యాలీ శక్తిగణపతి ఆలయంలో తాచుపాము

### తాచుపాము హల్‌చల్

ఆత్రేయపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాలీ శక్తిగణపతి ఆలయంలో రెండు రోజుల నుంచి గోధుమ తాచు తిష్ట వేసి హల్‌చల్ చేస్తోంది. అది బయటకు వెళ్లకపోవడంతో స్నేక్ క్యాచర్ మాధవ్‌కు ఆలయ కమిటీ సమాచారం ఇచ్చారు. దీంతో అతను దాన్ని పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచి పెట్టినట్టు ఆలయ కమిటీ చైర్మన్ చింతా సూర్యచంద్రరావు తెలిపారు.

### పరస్పర గౌరవంతో ప్రపంచ శాంతి

ఆలమూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సర్వ ధర్మాల అవతార పురుషులను పరస్పరం గౌరవించుకోవడం ద్వారా ప్రపంచశాంతి స్థాపించబడుతుందని కమ్యూనిటీ నూరుల్ ఇస్లాం ఆంధ్రప్రదేశ్ ప్రజా సంబంధాల అధికారి మహమ్మద్ జావిద్ అహ్మద్ అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంకలో జరిగిన నూరుల్ ఇస్లామ్‌ల ఆత్మీయ కలయికకు బుధవారం వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి కోసం సమ్మేళనాలు, సెమినార్లు తదితర అనేక కార్యక్రమాలను తమ సంస్థ చేపడుతున్నదని చెప్పారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్, నాయకులు మహమ్మద్ సిరాజ్, ఎంఏ.జాఫర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రావులపాలెం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రావులపాలెం పరిధిలోని కొమరాజులంక బస్టాప్ వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఎస్ఐ చంటి తెలిపిన వివరాల ప్రకారం...గుర్తు తెలియని వ్యక్తి వయసు సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు కలిగిన పురుషుడి మృతదేహంగా గుర్తించామన్నారు. మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రిలోని మార్చురిలో ఉంచామని ఆయన తెలిపారు. బంధువులు వచ్చి గురించినట్టయితే మృతదేహాన్ని అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ అరుణ

### రోడ్డు పనులు ప్రారంభం

ద్రాక్షారామ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలోని నున్నవారివీధిలో కర్రి నాగమణి ఇంటి నుంచి ఎస్టీ కాలనీ వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ కొత్తపల్లి అరుణ ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం పల్లె పండుగలో బాగంగా రూ.3.50 లక్షలు రోడ్డు నిర్మాణానికి కేటాయించిందన్నారు. దీంతో రోడ్డు నిర్మాణం ప్రారంభించామని ఆమె తెలిపారు. మంత్రి సుభాష్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.


నున్న వీర్రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

### నున్న వీర్రాజు కుటుంబీకులకు పరామర్శ

ద్రాక్షారామ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే నున్న వీర్రాజు మనుమడు నున్న వీర్రాజు కుటుంబీకులను బుధవారం మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ బుధవారం పరామర్శించారు. ఇటీవల వీర్రాజు అనారోగ్యంతో మృతి చెందారు. నున్న వీర్రాజు కుమారుడు, సోదరుడు దివంగత మాజీ ఎంపీపీ నున్న రామచంద్రరావు కుమారుడు నున్న అభిరామ్‌లను పరామర్శించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ ఎస్.బాబి, వైసీపీ నాయకులు నరాల ఏడుకొండలు, నున్న కల్యాణ్ ఉన్నారు.


మునీశ్వరమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

### మునీశ్వరమ్మ కుటుంబ సభ్యులకు పరామర్శ

ఆలమూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ చల్లా మునీశ్వరమ్మ మృతికి మాజీ మంత్రి ముద్రగడ్డ పద్మనాధం సంతాపం వ్యక్తం చేసి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మునీశ్వరమ్మ కుమారులు చల్లా ప్రభాకరరావు, నానాజీ, భూషణంలను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కెవీవీ సత్యనారాయణ, లక్ష్మణబాబు, జి.స్వామి తదితరులు పాల్గొన్నారు.